అనుదినం జనపక్షం
www.navatelangana.com
నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
ఆదిలాబాద్, నిర్మల్, మంచిర్యాల
కుమురం భీం-ఆసిఫాబాద్
1
మంగళవారం 17 జనవరి 2023

ఘనంగా సంక్రాంతి పండుగ

కౌటాల : మండల కేంద్రంతో పాటు మండలంలోని అన్ని గ్రామాల్లో సంక్రాంతి పండుగ వేడుకలను శని, ఆది, సోమవారాలు ఘనంగా జరుపుకున్నారు. మహిళలు ముంగిట్ల ముందు రంగురంగుల ముగ్గులు వేయగా, పిల్లలు పతంగులు ఎగరవేయడంలో నిమగ్నమయ్యారు. రైతు ఆరుగాలం కష్టపడి పండించిన పంట ఇంటికి రావడంతో సంతోషంగా ఈ పండుగ వేడుకలను జరుపుకున్నారు.

వాంకిడి : మండల కేంద్రంతో పాటు వివిధ గ్రామాల్లో సంక్రాంతి పండుగను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళలు ఇంటి ముందు అందమైన రంగురంగుల ముగ్గులు వేసి పిండి వంటలు చేశారు. అనంతరం అందరు సుఖసంతోషాలతో ఉండాలని దేవాలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు.

పెంచికలపేట్ : సంక్రాంతి పండుగను గ్రామాల్లో ఘనంగా జరుపుకున్నారు. మహిళలు ఇంటి ముందు రంగురంగుల ముగ్గులు వేయగా పిల్లలు పతంగులు ఎగరవేయడంలో నిమగ్నమయ్యారు. కనుమ సందర్భంగా మండల కేంద్రంలోని శివాలయంలో లక్ష పసుపు కొమ్ముల నోమును ఆర్యవైశ్య మహిళా సంఘం ఆధ్వర్యంలో నిర్వహించారు.

జై జవాన్ జై కిసాన్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆర్థికసాయం

ఖానాపూర్ : పట్టణంలోని శాంతినగర్ కాలనీకి చెందిన జ్యోతి ఇటీవల అనారోగ్యంతో మృతి చెందింది. సోమవారం. జై జవాన్ జై కిసాన్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో మృతురాలి భర్త ఆకుల వెంకటేష్‌కు రూ.5000 ఆర్థిక సహాయాన్ని అందజేశారు. మృతురాలికి ఇద్దరు కూతుళ్లు, బాబు ఉన్నారు. వీరిది నిరుపేద కుటుంబం. భర్త వెంకటేష్ ప్రైవేట్ కార్ డ్రైవర్‌గా పని చేస్తూ పిల్లలను పోషిస్తున్నాడు. ఈ కార్యక్రమంలో ఫౌండేషన్ సభ్యులు బుగ్గారం లింగన్న, రాపెల్లి రవీందర్, పడిగెల రాజశేఖర్(సర్పంచ్), అల్లెపు ఎల్లయ్య, గోగు నరేందర్, గోగు మహేందర్, చందాల అరుణ్, దినేష్ పాల్గొన్నారు.



ఫలించనున్న నిరీక్షణ..!

- బదిలీలు, పదోన్నతులకు ప్రభుత్వం అంగీకారం
- ఉమ్మడి జిల్లాలో వేలాది మంది ఉపాధ్యాయులకు ప్రయోజనం
- వచ్చే విద్యాసంవత్సరంలోనే కొత్త పోస్టుల్లోకి

ఉమ్మడి జిల్లాలోని ఉపాధ్యాయుల నిరీక్షణ ఫలించనుంది. బదిలీలు, పదోన్నతులు లేక నష్టపోతున్న వేలాది మందికి ప్రయోజనం కలిగించనుంది. రాష్ట్ర ప్రభుత్వం ఈ ప్రక్రియ చేపట్టేందుకు అంగీకారం తెలుపడం ఉపాధ్యాయ వర్గాల్లో హర్షం వ్యక్తమవుతోంది. ఫలితంగా ఏండ్ల తరబడి ఎదురుచూస్తున్న ఉపాధ్యాయుల కల ఎట్టకేలకు నెరవేరబోతోంది. ప్రభుత్వం ఈ నెల 18 నుంచి ఈ క్రతువును ప్రారంభించాలని నిర్ణయించింది. ఈ ఏడాది బదిలీలు, పదోన్నతులు జరిగినా వచ్చే విద్యా సంవత్సరంలోనే కొత్త పోస్టుల్లో చేరే అవకాశం ఉందని విద్యాశాఖవర్గాలు చెబుతున్నాయి. ఏండ్ల తరబడి బదిలీలు లేక అనేక మంది ఒకే చోట పనిచేస్తుండగా.. పదోన్నతులు చేపట్టకపోవడంతో వందలాది మంది ఉపాధ్యాయులు అన్ని రకాలుగా నష్టపోతున్నారు. ఇప్పటికే అనేక మంది ఉపాధ్యాయులు పదవీ విరమణ పొందినట్లు తెలుస్తోంది. రాష్ట్రంలో ఈ ప్రక్రియ చేపట్టాలని ఆయా ఉపాధ్యాయ సంఘాలు గత అయిదేండ్లుగా నుంచి డిమాండ్ చేస్తున్నాయి. ప్రభుత్వం ఎట్టకేలకు వీరి సమస్యపై స్పందించడంతో ఉపాధ్యాయవర్గాలు సంతోషం వ్యక్తం చేస్తున్నాయి.

నవతెలంగాణ- ఆదిలాబాద్ ప్రాంతీయ ప్రతినిధి

ఏండ్లుగా ఉపాధ్యాయుల బదిలీలు, పదోన్నతులు లేకపోవడంతో వారి నుంచి తీవ్ర అసంతృప్తి వ్యక్తమవుతోంది. ఆయా సందర్భాల్లో వీటిని చేపట్టాలని వివిధ ఉపాధ్యాయ సంఘాలు తీవ్ర స్థాయిలో నిరసన తెలిపాయి. ఇది వరకు ప్రభుత్వం 2018లో బదిలీల ప్రక్రియ చేపట్టగా.. 2019లో పదోన్నతులు చేపట్టింది. బదిలీలకు ఒకే చోట 8ఏండ్లు సర్వీసు పూర్తిచేసుకున్న వారు తప్పనిసరిగా బదిలీ కాగా.. రెండేండ్లు దాటిన వారు ఆప్షన్ నమోదుకు అవకాశం ఉంటుంది. ఇక పదోన్నతులు లేకపోవడంతో విద్యాశాఖలో ఖాళీలు భర్తీ కాకపోవడం.. పర్యవేక్షణ లేకుండా పోవడం వంటి సమస్యలు ఉన్నాయి. ఎస్జీటీల నుంచి స్కూల్ అసిస్టెంట్లుగా.. ఎస్ఏల నుంచి పీజీహెచ్ఎంలుగా పదోన్నతులు చేపట్టాల్సి ఉంటుంది. స్కూల్ అసిస్టెంట్ పోస్టుల్లో 70శాతం పదోన్నతిపై మరో 30శాతం రిక్రూట్‌మెంట్ ద్వారా చేపట్టాలనే నిబంధన ఉంటుంది. ఈ ప్రక్రియ చేపడితే ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో విద్యాశాఖ గుర్తించిన 808 ఖాళీలతో పాటు మరో 128మంది ఎస్జీటీలకు అదనంగా పదోన్నతి లభించే అవకాశం ఉంటుంది. ఈ లెక్కన ఉమ్మడి జిల్లాలో 936మందికి పదోన్నతి లభించే అవకాశం ఉంటుంది. మరోపక్క పండిత్, పీఈటీల పదోన్నతుల ప్రక్రియ సైతం కోర్టు పరిధిలో ఉండటం.. ప్రభుత్వ, జిల్లా పరిషత్ ఉపాధ్యాయుల మధ్య వివాదం వంటి సమస్యలు పీజీహెచ్ఎం



పదోన్నతులకు కూడా అవరోధంగా మారుతోంది. ఈ సమస్య పరిష్కారమైతేనే ఎంఈఓ పదోన్నతులు తేలే అవకాశం ఉంటుందని తెలుస్తోంది.

సర్కారు బడులకు మేలు..!

విద్యాశాఖ చేపట్టే ఉపాధ్యాయుల బదిలీలు, పదోన్నతులతో సర్కారు బడులకు మేలు జరిగే అవకాశం ఉంటుంది. చాలా మంది ఉపాధ్యాయులు 2011 నుంచి ఒకే చోట విధులు నిర్వహిస్తున్నారు. వీటితో పాటు పదోన్నతులు లేక పర్యవేక్షణ వ్యవస్థ పూర్తిగా గాడితప్పుతోంది. తాజాగా చేపట్టనున్న బదిలీలు, పదోన్నతులతో అటు ఉపాధ్యాయులకే కాకుండా విద్యార్థులకు కూడా ప్రయోజనం కలుగనుంది. చాలా ఉన్నత పాఠశాలల్లో సబ్జెక్టు బోధకులు లేక విద్యార్థులకు నష్టపోతున్నారు. ఇటీవల వర్క్ అడ్జస్ట్‌మెంట్ కింద పలువురు ఎస్జీటీలను ఉన్నత పాఠశాలలకు పంపించి బోధన చేయిస్తున్నారు. ఈ ప్రక్రియపై ఎస్జీటీల నుంచి నిరసన వ్యక్తమైన సందర్భాలున్నాయి. ఈ ఏడాది 317 జీఓ కింద బదిలీ అయిన ఉపాధ్యాయులు మినహా తాజా బదిలీ ప్రక్రియతో వేలాది మంది ఉపాధ్యాయులు కొంత అనువైన స్థానాలకు వెళ్లేందుకు అవకాశం ఉంటుందని తెలుస్తోంది. ఈ రెండు ప్రక్రియలు జరిగితే సర్కారు బడుల్లో ఉపాధ్యాయుల లోటును కొంత వరకైనా తీర్చవచ్చు. ముఖ్యంగా ఉన్నత పాఠశాలల్లో సబ్జెక్టు బోధకుల కొరత తీరే అవకాశం ఉంటుంది. ఫలితంగా సర్కారు బడుల్లో చదివే పేద విద్యార్థులకు మరింత మెరుగైన విద్య లభించేందుకు ఆస్కారం ఉంటుంది.

ప్రభుత్వం చొరవ చూపడం సంతోషం : వి.అశోక్, టీఎస్‌యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి, ఆదిలాబాద్



ఉపాధ్యాయుల పదోన్నతులు, బదిలీల ప్రక్రియను ప్రారంభించేందుకు ఇప్పటికైనా ప్రభుత్వం చొరువ చూపడం సంతోషం. గత కొన్నేండ్లుగా వేలాది మంది ఉపాధ్యాయులు పదోన్నతులు లేకుండానే రిటైర్డ్ అయ్యారు. ఎంతో నష్టపోయారు. మేనేజ్‌మెంట్లు, క్యాడర్ల మధ్య ఉన్న ఇబ్బందులను అధిగమించి సమస్యలను సామరస్యంగా, సానుకూలంగా పరిష్కరించేందుకు ప్రభుత్వమే కృషిచేయాలి. ఆటంకాలు లేకుండా ఈ ప్రక్రియలను పూర్తిచేయాలి.

జీవో నెం.317 బాధిత ఉపాధ్యాయులకు న్యాయం చేయాలి

- పీఆర్టీయూటీఎస్ జిల్లా అధ్యక్షులు ఏటుకూరి శ్రీనివాసరావు

నవతెలంగాణ - కాగజ్‌నగర్ రూరల్

త్వరలో జరగనున్న ఉపాధ్యాయుల బదిలీలు, పదోన్నతుల్లో జీవో నెంబర్ 317 బాధిత ఉపాధ్యాయులకు న్యాయం చేయాలని పీఆర్టీయూటీఎస్ జిల్లా అధ్యక్షులు ఏటుకూరి శ్రీనివాసరావు, కార్యవర్గ సభ్యులు అదే ప్రకాష్, సెడ్మకె రాము, ఎనగంటి భిక్షపతి, పత్తిపాక శ్రవణ్, గడ్డం భిక్షపతి సోమవారం ఒక ప్రకటనలో కోరారు. 317 ద్వారా ఇతర జిల్లాలకు కేటాయించిన ఉపాధ్యాయులకు సొంత జిల్లా బదిలీ అవకాశం కల్పించాలన్నారు. ఇతర జిల్లాలకు కేటాయించిన ఉపాధ్యాయులకు పాత స్టేషన్ సర్వీస్ పాయింట్లు కేటాయించాలని, ప్రతి ఉపాధ్యాయునికి అవకాశం ఉండే విధంగా జీరో సర్వీస్‌కు అవకాశం కల్పించాలని పేర్కొన్నారు. జిల్లాలోని అన్ని ఖాళీలను చూపించాలని, పీహెచ్‌సీ, వితంతువు ఉపాధ్యాయురాళ్లకు ప్రాధాన్యత కల్పించాలని కోరారు. బదిలీల కంటే ముందే అంతర్ జిల్లా బదిలీలకు అవకాశం కల్పించాలని, బదిలీ అయిన ప్రతి ఉపాధ్యాయునికి నూతన స్కూల్‌లో వెంటనే జాయిన్ అయ్యే విధంగా ఆదేశాలు ఇవ్వాలని కోరారు. ప్రతి ప్రైమరీ స్కూల్‌కు కనీసం ఇద్దరు ఉపాధ్యాయులు ఉండాలని, పదోన్నతులను కౌన్సెలింగ్ ద్వారా నిర్వహించాలన్నారు. స్కూల్ విద్యార్థుల సంఖ్యను బట్టి ఉపాధ్యాయ పోస్టులను మంజూరు చేయాలని, హేతుబద్ధీకరణ నిర్వహించాలని, ఉపాధ్యాయులకు ఏకీకృత సర్వీస్ నియమాలు లేనందున ప్రస్తుతం తాత్కాలిక పదోన్నతులు, లోకల్ బాడీ హైస్కూల్ ప్రదానోపాధ్యాయుల పదోన్నతులు నూతన జిల్లాల వారీగా సర్వీస్ ఆధారంగా కల్పించాలని కోరారు. పదోన్నతుల్లో నాట్ విల్లింగ్ అవకాశం కల్పించాలని వారితో పాటు ఇతర కార్యవర్గ సభ్యులు ఇందారపు ప్రకాష్, తంగళ్లపల్లి రాకేశ్, రాంటెంకి బాబురావు, గుల్లపల్లి రవిశంకర్, ముంజంపల్లి రమేష్, రాంచందర్, గంగాభవానీ, వరలక్ష్మి, సునీత, సమత, సుజాత, గుండు యాదగిరి, జాడి దేవాజీ, కొయ్యడ శ్రీనివాస్, కమలాకర్‌రెడ్డి, సుభాష్‌గౌడ్, వేణుగోపాల్, శశికాంత్, పర్శ చంద్రశేఖర్ పేర్కొన్నారు.

కోడిపుంజుల పందేల స్థావరాలపై పోలీసుల మెరుపుదాడులు

నవతెలంగాణ - దహెగాం

మండలంలో సంక్రాంతి పండుగ సందర్భంగా ఆదివారం కోడి పందేల స్థావరాలపై పోలీసులు మెరుపుదాడులు చేశారు. గెర్రెగుట్ట గ్రామంలో కోడిపుంజుల పందేలు నిర్వహిస్తున్న శ్రీరాముల ఎల్లయ్య(బెల్లంపల్లి), బాకం రాము(పెరకపల్లి), బొక్క వెంకటేశ్వర్‌రావు(సీసీ నస్పూర్), బొక్క కోటేశ్వర్‌రావు(సీసీసీ నస్పూర్), దార లస్మయ్య(మందమర్రి) పాస్కకం బాలరాజు(బోరిగాం)తో పాటు దహెగాం మండల కేంద్రంలో మోర్లె తిరుపతి, బుర్రి రాము, చింతపుడి పున్నంను పట్టుకున్నారు. వీరిలో నుండి పుల్లం సంతోష్, గురిజాల వెంకన్న, వనపర్తి రాజు, జర్పుల కుమార్‌లు పారిపోయినట్టు పేర్కొన్నారు. ఈ రెండు ఘటనలో నాలుగు కోళ్లు, రూ.4150 స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసినట్టు ఎస్ఐ సనత్‌కుమార్ పేర్కొన్నారు.

సిర్పూర్(టి) : కోడి పందేలు, పేకాట, అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని, గ్రామాల్లో ప్రశాంతమైన వాతావరణం నెలకొల్పాలని, దీనికి భిన్నంగా వ్యవహరించిన వారిపై కేసులు నమోదు చేస్తామని ఎస్ఐ డీకొండ రమేష్ హెచ్చరించారు. శని, ఆదివారం కోడి పందేలు ఆడుతున్నారనే సమాచారం మేరకు భూపాలపట్నం, పారిగాం గ్రామ శివారు ప్రాంతాల్లో తనిఖీ నిర్వహించగా భూపాలపట్నం గ్రామానికి చెందిన 8 మంది, పారిగాం గ్రామానికి చెందిన 10 మందిని పట్టుకున్నారు. వీరి వద్ద నుండి రూ.21,130 నగదును, కోడి పందేనికి ఉపయోగించే కత్తులను స్వాధీనం చేసుకొని, వీరిపై కేసు నమోదు చేశామని ఎస్ఐ తెలిపారు. గ్రామాల్లో అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడుతున్న వారి వివరాలను గ్రామస్తులు తెలిపితే వారి వివరాలు గోప్యంగా ఉంచుతామని, పోలీసులకు సహకరించాలని ఆయన కోరారు.

కలెక్టర్ టీపీజీఎస్ క్యాలెండర్ ఆవిష్కరణ



నవతెలంగాణ-ఆసిఫాబాద్

తెలంగాణ ఆదివాసీ గిరిజన సంఘం క్యాలెండర్‌ను జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్, అడిషనల్ కలెక్టర్ చాహత్ బాజ్‌పేయి వారి వారి కార్యాలయంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆదివాసీ సంస్కృతి అభివృద్ధి చెందేలా, ఆదివాసులను చైతన్య పరిచే విధంగా కృషి చేయాలని అన్నారు. ఈ సందర్భంగా సంఘం జిల్లా ఉపాధ్యక్షులు కోట శ్రీనివాస్ మాట్లాడుతూ జిల్లాలో పోడు భూముల సమస్యలపై అనేక పోరాటాలు చేశామని, ఇప్పుడు రాష్ట్ర ప్రభుత్వం సర్వేలు నిర్వహించిందని అన్నారు. హక్కు పత్రాలు వచ్చే వరకు పోరాటం చేస్తామన్నారు. జిల్లాలో గిరిజన గ్రామాల్లో నెలకొన్న సమస్యలు పరిష్కరించాలని అనేక పోరాటాలు చేశామని, అధికారులు సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా సహాయ కార్యదర్శి నేర్పల్లి అశోక్, జిల్లా కమిటీ సభ్యులు దిగిడ బక్కన్న, కెవిపిఎస్ జిల్లా కార్యదర్శి దుర్గం దినకర్, డివైఎఫ్ఐ సహాయ కార్యదర్శి దుర్గం రాజ్ కుమార్ పాల్గొన్నారు.

సంఘమిత్ర బృందం ఆధ్వర్యంలో ముగ్గుల పోటీలు



పెంచికల్‌పేట్ : మండల కేంద్రంలో సంఘమిత్ర బృందం ఆధ్వర్యంలో ముగ్గుల పోటీలు నిర్వహించారు. సహజమైన ముగ్గు పిండి, పూలు ఉపయోగించి ఇంటి గుమ్మాల ముందు వేసిన ముగ్గులను వాట్సప్‌లో పంపగా మండల కేంద్రానికి చెందిన దందెర లావణ్యకు ప్రథమ బహుమతి, జిల్లెడ, బొంబాయిగూడ గ్రామాలకు చెందిన దుర్గం పావని, లస్కురి పద్మకు ద్వితీయ బహుమతి, 10 మంది మహిళలకు తృతీయ బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో ఎలుకపెల్లి, మురళీగూడ సర్పంచ్‌లు గణపురం కావ్య, పొరిశెట్టి ఈశ్వరి, తోరె బాపురావు, నగదు బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో సామాజిక కార్యకర్త చపిడె ప్రకాష్, ఎనగొందుల తిరుపతి, పొట్టె గణపతి, నారాయణ పాల్గొన్నారు.

'కంటి వెలుగు'ను విజయవంతం చేయాలి



నవతెలంగాణ-ఆదిలాబాద్ కలెక్టరేట్

జిల్లాలో కంటి వెలుగు కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని అదనపు కలెక్టర్ ఎన్. నటరాజ్ అన్నారు. సోమవారం స్థానిక యూత్ ట్రైనింగ్ సెంటర్‌లో కంటి వెలుగు డెమో కార్యక్రమాన్ని ఆయన పరిశీలించారు. తొలుత కంటి నిర్వహణ ఏర్పాట్లపై వైద్యాధికారులను అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వం నిర్దేశించిన మార్గదర్శకాలకు అనుగుణంగా రెండవ విడత కంటి వెలుగు కార్యక్రమాన్ని అధికారులు, ప్రజాప్రతినిధుల సమన్వయ సహకారంతో విజయవంతం చేయాలన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల 18 రాష్ట్ర ముఖ్యమంత్రి ఖమ్మం జిల్లాలో కంటి వెలుగు కార్యక్రమాన్ని లాంఛనంగా ప్రారంభిస్తారని, ఆ తదుపరి 19 నుండి రాష్ట్రంలోని అన్ని జిల్లాలో కంటి వెలుగు కార్యక్రమాన్ని మంత్రులు, శాసన సభ్యులు, ఇతర ప్రజాప్రతినిధుల ద్వారా ప్రారంభించి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని తెలిపారు. జిల్లాలో 468 గ్రామపంచాయతీలు, 49 మున్సిపల్ వార్డులలో వైద్య శిబిరాలు ఏర్పాటు చేస్తున్నామని, గ్రామీణ ప్రాంతంలో 27, పట్టణ ప్రాంతంలో 6 టీమ్‌లను ఏర్పాటు చేసి కంటి పరీక్షలు నిర్వహిస్తున్నామని తెలిపారు. చిన్నచిన్న లోపాలను గుర్తించి అవసరమైన మందులు, కళ్ల జోళ్లు అందించాలని అన్నారు. ప్రిస్క్రైబ్డ్ కళ్లజోళ్లు ఆయా కంపెనీ నుండి నేరుగా పంపించడం జరుగుతుందని తెలిపారు. కంటి వెలుగు పరీక్షకు వచ్చే ప్రతి ఒక్కరు వారి ఆధార్‌కార్డు వెంట తీసుకొని రావాలని కోరారు. కంటి వెలుగు కార్యక్రమ నిర్వహణకు ఇప్పటికే ఏర్పాట్లు పూర్తి చేయడం జరిగిందని, నిర్దిష్ట సమయానికి వైద్య సిబ్బంది, ఆశాలు అందుబాటులో ఉండి కార్యక్రమాన్ని ముందుకు తీసుకువెళ్లాలని కోరారు. అంతకుముందు ప్రతి టేబుల్‌ను పరిశీలించి కంటి పరీక్షల హాజరయ్యే వారి ఎన్రోల్‌మెంట్, పరీక్షలు వంటి వాటిని ఆయన వైద్యాధికారులను అడిగి తెలుసుకున్నారు. స్వయంగా కంటి పరీక్షలు ఆయన నిర్వహించుకున్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా వైద్యారోగ్య శాఖ అధికారి డా. నరేందర్ రాథోడ్, జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి కిషన్, మున్సిపల్ కమిషనర్ శైలజ, అదనపు జిల్లా వైద్యారోగ్య శాఖ అధికారి డా. సాధన, ఇతర డాక్టర్లు, వైద్య సిబ్బంది, ఆశాలు, ఏఎన్ఎంలు పాల్గొన్నారు.

కుమురం భీం విగ్రహావిష్కరణ

నవతెలంగాణ - వాంకిడి

మండలంలోని నవెదరి గ్రామంలో సోమవారం ఏర్పాటు చేసిన కుమురం భీం విగ్రహాన్ని జడ్పీ చైర్‌పర్సన్ కోవలక్ష్మి, ఎమ్మెల్యే ఆత్రం సక్కు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం కుమురం భీం వర్ధంతి, జయంతికి అన్ని ఏర్పాట్లు చేయడం జరుగుతుందన్నారు. ఆయన చేసిన సేవలను కొనియాడారు. ప్రతి ఒక్కరు భీం ఆశయాలు సాధించడానికి ముందుకురావాలని కోరారు. ప్రతి ఏడాది జోడేఘాట్‌లో భీం జయంతి, వర్ధంతిని రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా నిర్వహించడం జరుగుతుందని, ఆదివాసులను అభివృద్ధి చేయడానికి తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ముందుంటుందని పేర్కొన్నారు. అంతకుముందు గిరిజన సాంప్రదాయాలతో భాజాభజంత్రీలతో జెడ్పీ చైర్‌పర్సన్‌కు, ఎమ్మెల్యేకు స్వాగతం పలికారు. కార్యక్రమంలో ఎంపీపీ విమలాబాయి, ఆదివాసీ సర్పంచ్‌లు, నాయకులు పాల్గొన్నారు.

పత్తికి మద్దతు ధర కల్పించాలని తుడుందెబ్బ ధర్నా



ఆదిలాబాద్ అర్బన్ : పత్తికి మద్దతు ధర కల్పించాలని ఆదివాసీ హక్కుల పోరాట సమితి తుడుందెబ్బ ఆధ్వర్యంలో సోమవారం కలెక్టరేట్ ఎదుట ధర్నా చేపట్టారు. ఆర్డీఓ ధర్నా వద్దకు రావడంతో వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు గోడం గణేష్ మాట్లాడుతూ రైతులు పండించిన పత్తికి రూ.15వేలు గిట్టుబాటు ధర కల్పించాలని డిమాండ్ చేశారు. రైతులకు పంట సాగు పెట్టుబడులు పెరిగినా అందుకనుగుణంగా గిట్టుబాటు ధర కల్పించడంలో మాత్రం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పూర్తిగా విఫలమయ్యాయన్నారు. ఈ ఏడాది జులై మాసంలో అతివృష్టి వల్ల రైతులు పండించిన పంటలు చాలా వరకు నష్టపోయారన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు స్వామినాథన్ కమిటీ సిఫారసుల మేరకు శాస్త్రీయ పద్ధతిలో మద్దతు ధర నిర్ణయించకుండా భిన్నంగా వ్యవహరిస్తున్నాయని మండిపడ్డారు. మార్కెట్‌లో రైతులకు గిట్టుబాటు ధర దొరకకాపోగా ఉన్న ధరలు కూడా రోజురోజుకు తగ్గిస్తున్నారన్నారు. కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థ అయిన సీసీఐ మార్కెట్‌లో ప్రయివేట్ వ్యాపారులతో పోటీ పడి పత్తిని కొనుగోలు చేయకపోవడం వల్ల రైతులు నష్ట పోతున్నారన్నా రు. పత్తి పంటకు రూ.15 వేలు గిట్టుబాటు ధర కల్పించాలని, లేని పక్షంలో రైతులతో కలిసి మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేల ఇండ్లను ముట్టడిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఆదివాసీ హక్కుల పోరాట సమితి తుడు దెబ్బ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఉయిక సంజీవ్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు జల్కే పాండురాంగ్, కుడుమేత తిరుపతి, నాయకులు కుంర శ్యాంరావు, వెట్టి మనోజ్, ఉయిక సుదర్శన్, జిల్లా ఉపాధ్యక్షుడు నైతం రమేష్, ఉయిక ఇందిరా, చహకటి సునీల్, మరప జామునబాయి, సలాం వరుణ్, మెస్రం భాస్కర్, గెడం కేశవ్, బి.రాహుల్ పాల్గొన్నారు.

బౌద్ధ సమాజ్ తాలుకా కమిటీ ఎన్నిక

కౌటాల : బౌద్ధ సమాజ్ సిర్పూర్ తాలుకా కమిటీని మండల కేంద్రంలోని జశ్వంత్ బుద్ధవిహార్ ప్రాంగణంలో ఆదివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కమిటీ అధ్యక్షుడిగా బసార్కర్ విశ్వనాథ్, ఉపాధ్యక్షుడిగా కోబ్రాగడె వెంకటేశ్, దుర్గం దేవాజీ, గోల్లపల్లి శంకర్, ఓండ్రె ప్రమానంద్, ప్రధాన కార్యదర్శిగా రత్నం శ్రీకాంత్, సంయుక్త కార్యదర్శులుగా దుర్గం తులసీరాం, డోంగ్రి సదాశివ్,దుర్గం వెంకటి, ప్రచార కార్యదర్శులుగా దుర్గం శ్యాంరావు, ముడిమడుగుల నర్సయ్య, ముడిమడుగులదేవాజీ, కోశాధికారిగా మోహన్‌లాల్, కార్యవర్గ సభ్యులుగా దుర్గె మాదవ్, బండురావు, రాజారాం, మారుతి, మల్లయ్యను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.



గోడ నిర్మాణాన్ని అడ్డుకున్న కాలనీవాసులు

- ఎస్పీఎం యాజమాన్యంపై మండిపాటు



నవతెలంగాణ-కాగజ్‌నగర్

ప్రజలు నిత్యం రాకపోకలు సాగించే రహదారులను మూసివేస్తూ సిర్పూర్ పేపర్ మిల్లు యాజమాన్యం గోడ నిర్మాణం చేపట్టే ప్రయత్నాలను సోమవారం కాలనీవాసులు అడ్డుకున్నారు. స్థానిక ఓల్డ్‌కాలనీలో ఎస్పీఎం స్థలంలో గోడ నిర్మాణం చేపట్టేందుకు ఎస్పీఎం ప్రతినిధులు కూలీలతో వచ్చారు. విషయం తెలుసుకున్న టీఆర్ఎస్ నాయకులు నియాజుద్దీన్ బాబా, కాలనీవాసులు వచ్చి అడ్డుకున్నారు. నిత్యం తాము రాకపోకలు సాగించే రోడ్డును ఎలా మూసివేస్తారని ప్రశ్నించారు. ఇప్పటికే ప్రజలు సంచరించే మూడు ప్రదేశాలలో గోడలు నిర్మించారని మండిపడ్డారు. ఈ విషయాన్ని మున్సిపల్ కమిషనర్ అంజయ్యకు తెలుపగా ఆయన గోడ నిర్మిత ప్రదేశానికి వచ్చి ఎస్పీఎం ప్రతినిధులను ప్రశ్నించారు. గోడ నిర్మించేందుకు తమ వద్ద అనుమతులు ఉన్నాయని వారు తెలుపగా, అనుమతి పత్రాలు తీసుకురావాలని కమిషనర్ సూచించారు. అనుమతి ఇవ్వాల్సింది మున్సిపలేనని, తాను అనుమతి ఇవ్వలేదని, ఎవరు అనుమతి ఇచ్చారని కమిషనర్ ప్రశ్నించారు. దీనితో ఎస్పీఎం ప్రతినిధులు వెనుతిరిగారు. దీనితో తాత్కాలికంగా వివాదం సద్దుమణిగింది. ఇప్పటికే యాజమాన్యం రాత్రి పది గంటలు దాటిన తర్వాత తమను ఈ రోడ్డుపైకి అనుమతించడం లేదని కాలనీవాసులు మండిపడుతున్నారు. తమకు శాశ్వత పరిష్కారం కావాలని, యాజమాన్యం మొండి వైఖరిని అధికారులు సమర్ధవంతంగా ఎదుర్కొని తమకు న్యాయం చేయాలని కాలనీవాసులు కోరుతున్నారు.

ఎస్సీ వర్గీకరణ బిల్లు పార్లమెంటులో ప్రవేశపెట్టాలి



నవతెలంగాణ-ఆదిలాబాద్‌అర్బన్

ఎస్సీ రిజర్వేషన్ల వర్గీకరణ బిల్లును ఈ పార్లమెంట్ సమావేశంలో ప్రవేశపెట్టాలని ఎమ్మార్పీఎస్ జిల్లా కన్వీనర్ అరెల్లి మల్లేష్ అన్నారు. ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షులు మందకృష్ణ మాదిగ ఆదేశాల మేరకు సోమవారం ఎంపీ సోయం బాపురావును ఆయన నివాసంలో కలిసి వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎస్సీ రిజర్వేషన్ల వర్గీకరణ చట్టబద్ధతకు చొరవ తీసుకొని కేంద్ర ప్రభుత్వ పెద్దలతో మాట్లాడి ఒప్పించాలనీ విజ్ఞప్తి చేశారు. ఎస్సీ రిజర్వేషన్ల వర్గీకరణ కోసం 28 ఏళ్లుగా ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో ఉద్యమాలు చేస్తున్నామని తెలిపారు. పండిత్ దీన్ దయాల్ అంత్యోదయ స్ఫూర్తితో ఎదిగిన బిజెపి ఆది నుండి ఎమ్మార్పీఎస్ చేస్తున్న పోరాటానికి మద్దతిచ్చిందని అన్నారు. ప్రతి అసెంబ్లీ, పార్లమెంటు ఎన్నికల్లో ఎస్సీ వర్గీకరణకు అనుకూలంగా బిజెపి హామీ ఇచ్చిందని గుర్తు చేశారు. రెండు తెలుగు రాష్ట్రాలకు చెందిన బిజెపి పెద్దలే కాకుండా జాతీయస్థాయిలో బిజెపి ప్రముఖులు వర్గీకరణను సమర్థిస్తూ ఆనాటి కేంద్ర ప్రభుత్వాలకు లేఖలు రాశారన్నారు. కేంద్రంలో అధికారంలోకి వస్తే వంద రోజుల్లో వర్గీకరణ చేస్తామని మాదిగలకు హామీ ఇచ్చి నేటికి 8 సంవత్సరాలు పూర్తయిందన్నారు. అధికారంలో ఉండి ఎస్సీ వర్గీకరణ పై నోరు మెదపకపోవడం శోచనీయమన్నారు. తక్షణమే ఎస్సీ వర్గీకరణ బిల్లును పార్లమెంటులో ప్రవేశపెట్టేలా ప్రధానమంత్రి, హోంమంత్రులను ఒప్పించాలని కోరారు. ఎంపీని కలిసిన వారిలో ఎమ్మార్పీఎస్ నాయకులు బరుకుంట సుభాష్, జిల్లపెల్లి నవీన్, చిట్టి, రవి , దుబ్బాక చందు, ఈరగొల్ల శ్రీహరి, దర్శనాల జైపాల్, బత్తిని గంగయ్య, ఉప్పులేటి శ్రీను, సింగారపు స్వామి ఉన్నారు.

డంపింగ్ యార్డు ఆక్రమణకు గురవుతున్నా పట్టించుకోరా..!

- ఆక్రమణదారులపై చర్యలు తీసుకోవాలి
- ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్



నవతెలంగాణ-కాగజ్‌నగర్

కాగజ్‌నగర్ పట్టణంలో అధికారపార్టీ ఆగడాలు మితిమీరుతున్నాయని బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షులు ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ మండిపడ్డారు. సోమవారం కాగజ్‌నగర్‌కు వచ్చిన ఆయన స్థానిక సర్‌సిల్క్‌లోని మున్సిపల్ డంపింగ్ యార్డు స్థలాన్ని పరిశీలించారు. గతంలో మున్సిపల్ డంపింగ్ యార్డు స్థలాన్ని నేడు ప్రైవేట్ వ్యక్తులు ఆక్రమించుకొని ప్లాట్లు చేస్తున్న విషయం తెలుసుకున్న ఆయన ఆ స్థలాన్ని పరిశీలించారు. అక్కడే ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ పట్టణం నడిబొడ్డున కోట్లాది రూపాయల ప్రజల ఆస్తి ఆక్రమణకు గురవుతున్నా రెవెన్యూ అధికారులు ఎందుకు చోద్యం చూస్తున్నారని ప్రశ్నించారు. మున్సిపల్ శాఖా మంత్రి కేటీఆర్ కనుసన్నల్లోనే స్థానిక ఎమ్మెల్యే అనుచరులు ప్రభుత్వ భూముల ఆక్రమణకు పాల్పడుతున్నారని ఆరోపించారు. ఒకప్పుడు మున్సిపల్ డంపింగ్ యార్డు స్థలం ఇప్పుడు ప్రైవేట్ వ్యక్తుల స్థలాం ఎలా అవుతుందని ఆయన ప్రశ్నించారు. దీనిపై విచారణ జరిపి స్థలం ఆక్రమించిన వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బీఎస్పీ రాష్ట్ర కార్యదర్శి ఆర్ ఎస్ ప్రవీణ్‌కుమార్, నియోజకవర్గ ఇన్‌ఛార్జి అర్షద్‌హుస్సేన్, నాయకులు దుర్గం ప్రవీణ్‌కుమార్ పాల్గొన్నారు.

అనుదినం జనస్వరం
www.navatelangana.com
నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
ఆదిలాబాద్, నిర్మల్
2
మంగళవారం 17 జనవరి 2023

యాదవ సంఘం క్యాలెండర్ ఆవిష్కరణ

నవతెలంగాణ-ఆదిలాబాద్ కలెక్టరేట్

ఆదిలాబాద్ పట్టణంలోని యాదవ్ సంఘం భవనంలో సోమవారం ఏర్పాటు చేసిన నూతన సంవత్సర క్యాలెండర్‌ను ఎమ్మెల్యే జోగు రామన్న ఆవిష్కరించారు. అనంతరం ఎమ్మెల్యే జోగు రామన్నను యాదవ సంఘం సభ్యులు ఎమ్మెల్యేను ఘనంగా సన్మానించారు. అనంతరం జైనథ్ మార్కెట్ వైస్ చైర్మెన్‌గా నియమితులైన వేణుగోపాల్ యాదవ్‌ను సంఘ సభ్యులతో కలిసి ఎమ్మెల్యే ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఎమెల్యే మాట్లాడుతూ యాదవ సంఘం అభివృద్ధికి పూర్తి సహకారం ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో యాదవ సంఘం నాయకులు రఘువీర్ యాదవ్, డాక్టర్ రవికిరణ్ యాదవ్, హన్మాండ్లు యాదవ్, నవీన్ యాదవ్, పురుషోత్తం యాదవ్ పాల్గొన్నారు.

మార్కెట్ కమిటీ వైస్ చైర్మెన్‌కు సన్మానం

నవతెలంగాణ-ఆదిలాబాద్ కలెక్టరేట్

జైనథ్ వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మెన్‌గా నియమితులైన వేణుగోపాల్ యాదవ్‌ను ఎమ్మెల్యేలు జోగు రామన్న, రాథోడ్ బాపురావులు ఆదివారం సన్మానించారు. ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలోని యాదవ సంఘం భవనంలో ఏర్పాటు చేసిన సన్మాన కార్యక్రమంలో ఎమ్మెల్యేలు యాదవ సంఘం నాయకులు పాల్గొని వేణుగోపాల్ యాదవ్‌కు శాలువా కప్పి, పుష్పగుచ్ఛాన్ని అందించి సన్మానించారు. ఈ కార్యక్రమంలో యాదవ సంఘం నాయకులు రఘువీర్ యాదవ్, డాక్టర్ రవి కిరణ్ యాదవ్, హన్మండ్లు యాదవ్, నవీన్ యాదవ్, పురుషోత్తం యాదవ్ పాల్గొన్నారు.

ప్రజాసేవ అభినందనీయం

- ఆదిలాబాద్ ఎమ్మెల్యే జోగు రామన్న
- జెడ్పీ చైర్మెన్ జనార్దన్ రాథోడ్ ఆధ్వర్యంలో 2వేల దుప్పట్ల పంపిణీ



నవతెలంగాణ-ఉట్నూర్

జిల్లా ప్రజలకు అందిస్తున్న సేవలు అభినందనీయమని బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్యే జోగు రామన్న అన్నారు. సోమవారం జెడ్పీచైర్మెన్ రాథోడ్ జనార్దన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన దుప్పట్ల పంపిణీ కార్యక్రమానికి ఎమ్మెల్యే జోగు రామన్న, రాష్ట్ర మహిళ కమిషన్ సభ్యురాలు కుమ్ర ఈశ్వరి బాయి, ఏటీడబ్ల్యూఏసీ చైర్మెన్ కనక లక్కేరావు, మాజీ ఎంపీ గోడం నగేష్ ముఖ్యఅతిథులుగా హాజరయ్యారు. ముందుగా డా.బీఆర్ అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా జోగు రామన్న మాట్లాడుతూ ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో సేవ కార్యక్రమాల్లో ముందుగా ఉండేది కాగజ్ నగర్ ఎమ్మెల్యే దివాకర్‌రావు, ఆదిలాబాద్ జెడ్పీచైర్మెన్ రాథోడ్ జనార్దన్ అన్నారు. గత 8 ఏండ్ల నుండి ఉద్యోగిగా ఉన్నప్పటి నుంచి జెడ్పీ చైర్మెన్‌గా ఎదిగినప్పటికి సేవ కార్యక్రమాలు మారువలేదన్నారు. ఏమాత్రం ఎన్నికలు ఇతర స్వార్థ ప్రయోజనం లేకుండా దుప్పట్ల పంపిణీ కార్యక్రమం చేయడం గొప్ప విషయమని అన్నారు. ప్రతి వ్యక్తి సంపాదనలో పది శాతమైన నిధులతో సేవ కార్యక్రమాలు చేయాలని సూచించారు. బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడిగా ఎన్నికైన తర్వాత ఇక్కడకు తీసుకొని వచ్చి సన్మానం చేయడం ఆనందంగా ఉందని అన్నారు. అనంతరం జెడ్పీ చైర్మెన్ రాథోడ్ జనార్దన్ మాట్లాడుతూ ప్రజలకు సేవ చేయడంలో ఉన్న ఆనందం మరెందులో దొరకదని అన్నారు. నిరంతరంగా ప్రజా సేవకే పని చేస్తానని అన్నారు. అనంతరం పేదలకు దుప్పట్లను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు తిరుపతి, దావుల రమేష్ పాల్గొన్నారు.

గిరిజన విద్యారంగ అభివృద్ధికి కృషి

- టీఏవీఎస్ క్యాలెండర్‌ను ఆవిష్కరించిన ఐటీడీఏ పీఓ వరుణ్ రెడ్డి



నవతెలంగాణ-ఉట్నూర్

గిరిజన విద్యారంగ అభివృద్ధికి పటిష్ట చర్యలు చేపడుతున్నట్టు ఐటీడీఏ పీఓ వరుణ్ రెడ్డి అన్నారు. సోమవారం ఐటీడీఏలోని సమావేశపు మందిరంలో తెలంగాణ ఆదివాసీ విద్యార్థి సంఘం నూతన క్యాలెండర్, రాష్ట్ర 2వ మహాసభల కరపత్రం ఈ సంఘం నాయకులతో కలిసి ఆయన విడుదల చేశారు. ఈ సందర్భంగా పీఓ మాట్లాడుతూ జిల్లాలో గిరిజన విద్యారంగ అభివృద్ధికి పటిష్ట చర్యలు తీసుకుటున్నామని అన్నారు. గిరిజన విద్యారంగ సమస్యల పరిష్కారానికి సంఘ నాయకుల కృషి ఆమోగమని నాయకులను అభినందించారు. ఫిబ్రవరి 5, 6న జరిగే తెలంగాణ ఆదివాసీ విద్యార్థి సంఘం రాష్ట్ర మహాసభలు జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సంఘం రాష్ట్ర కార్యదర్శి పూసం సచిన్, ఐటీడీఏ ఏపీఓ జనరల్ భీంరావ్, పీవీటీజీ ఏపీఓ ఆత్రం భాస్కర్, టీఏవీఎస్ జిల్లా ఉపాధ్యక్షులు లంక రాఘవులు, మాడవి నాగోరావ్, కనక మల్కు, ఉయిక విష్ణు ఉన్నారు.

కంటివెలుగు డెమోను పరిశీలించిన మంత్రి

- కంటి పరీక్షలు చేయించుకున్న మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి



నవతెలంగాణ-నిర్మల్

మండలంలోని ఎల్లపల్లి గ్రామంలో మంత్రి అల్లోల ఇంద్రకరణ్ రెడ్డి సోమవారం కంటివెలుగు డెమోను పరిశీలించి, కంటి పరీక్షలు చేయించుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జనవరి 19 న ఉదయం 9 గంటలకు ప్రారంభం కానున్న కంటివెలుగు కార్యక్రమానికి సంబంధించి అన్ని ఏర్పాట్లు పూర్తి చేయడం జరిగిందన్నారు. కంటి వెలుగు పరీక్షలు చేయించుకునే వారు తమ ఆధార్ కార్డు వెంట తీసుకురావాలని అన్నారు. అలాగే గ్రామాల్లో శిబిరాలు ఏర్పాటు చేసిన మెడికల్ సిబ్బందికి తగు వసతి కల్పించాలని, ఎలాంటి లోటు పాట్లు జరగకుండా తగు చర్యలు చేపట్టి గిన్నిస్ బుక్ వరల్డ్ రికార్డు సాధించాలని ఆశాభావం వ్యక్తం చేశారు. అందరూ సమన్వయంతో పని చేసి విజయవంతం చేయాలని అన్నారు. కార్యక్రమంలో కలెక్టర్ ముషారఫ్ అలీ ఫారూఖీ, సీడీఎంఏ సత్యానారాయణ, డైరెక్టర్ ఆఫ్ మెడికల్ ఎడ్యూకేషనల్ అధికారి రమేష్ రెడ్డి, అదనపు కలెక్టర్ హేమంత్ బోర్కడే, డీఎంహెచ్ఓ ధన్‌రాజ్, ఆర్ డీఓ స్రవంతి, మున్సిపల్ చైర్మెన్ గంద్రత్ ఈశ్వర్, మాస్ మీడియా అధికారి రవీందర్, డా. శ్రీనివాస్, మెడికల్, సిబ్బంది, ప్రజాప్రతినిధులు సంబంధిత జిల్లా అధికారులు పాల్గొన్నారు.

అంధత్వ నివారణకే కంటివెలుగు

- ఎంపీపీ మహిపాల్ రెడ్డి



నవతెలంగాణ-సారంగాపూర్

అంధత్వాన్ని నివారించి పేదల జీవితాల్లో వెలుగును నింపేందుకే కంటి వెలుగు పథకాన్ని ప్రభుత్వం అమలు చేస్తోందని ఎంపీపీ మహిపాల్ రెడ్డి అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని గ్రామపంచాయతీలో 18న రెండో విడుత కంటి వెలుగు పథకం ప్రారంభిస్తున్నామని తెలిపారు. దానికి సంబంధించిన ఏర్పాట్లను అధికారులతో కలిసి పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కంటివెలుగు మండలకేంద్రంతో పాటు ఆలూరు గ్రామంలో మొదటగా 18న ప్రారంభమవుతుందని అన్నారు. అలాగే గ్రామాలవారిగా ప్రతి గ్రామంలో కంటి వెలుగు కార్యక్రమం ఉంటుందని తెలిపారు. 18న నుంచి మే 19 వరకు వందరోజుల పాటు కొనసాగుతుందన్నారు. కంటి సమస్యలు ఉన్న వారికి ఉచితంగా కంటి పరీక్షలు చేసి కండ్ల అద్దాలు, అవసమైనవారికి కంటి ఆపరేషన్ చేసి మందులను అందించడం జరుగుతుందని అన్నారు. మండల ప్రజలు ఇట్టి అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ సరోజ, తహసీల్దార్ సంతోష్ రెడ్డి, ఎంపీఓ తిరుపతి రెడ్డి, డాక్టర్లు వేదవ్యాస్, అలీ, పర్యవేక్షకులు కెఎం గౌడ్, సరస్వతి, గ్రామ సర్పంచ్ సుజాత నర్సారెడ్డి, ఉపసర్పంచ్ ముత్యం, కార్యదర్శి గోపి కృష్ణ,హెల్త్ అసిస్టెంట్స్ కిరణ్ కుమార్, రాజేందర్, డేటా ఎంట్రీ ఆపరేటర్ జాన్సీ, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

ఎకరానికి రూ.15లక్షల నష్టపరిహారం ఇవ్వాలి

- సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుల శ్రీనివాస్



నవతెలంగాణ-కడెం

జూలై నెలలో వచ్చిన అధిక వర్షాలతో కడెం నది పరివాహక ప్రాంతమైన పెంబి, కడెం మండలాలలో కొట్టుకపోయిన, పనికి రాకుండా పోయిన భూములకు ఎకరానికి రూ.15 లక్షల నష్టపరిహారం ఇవ్వాలని సీపీఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు టి.శ్రీనివాస్ డిమాండ్ చేశారు. సోమవారం కడెంలో మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ అధిక వరదలతో వందలాది ఎకరాల భూములు కోతకు గురయ్యాయని అన్నారు. కొన్ని భూములు పాక్షికంగా నష్టపోయాయని అన్నారు. మరికొన్ని అసలు సాగుకు పనికి రాకుండా చెరువులాగా మారిపోయాయని అన్నారు. ఈ భూములను రైతులు పంట నష్టపోవడమే కాకుండా శాశ్వతంగా సాగుకు పనికి రాకుండా పోయాయని అన్నారు. దీంతో ఏం చేయాలో తెలియక రైతులు తీవ్రమైన ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. రైతులు సమస్య పరిష్కారం కోసం అధికారుల చుట్టూ తిరుగుతున్నారని అన్నారు. ఇప్పటికి ప్రభుత్వం కనీసం సర్వే కూడా నిర్వహించకుండ నిర్లక్ష్యం చేస్తోందని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఆలోచించి భూములు కోతకు గురైన రైతులకు ఎకరానికి ఐదు లక్షల రూపాయలు లేదా సాగు యోగ్యంగా భూములను మార్చి ఇవ్వాలని, అలాగే సాగుకు పనికి రాకుండా పోయిన భూములకు ఎకరాకు రూ.15 లక్షల నష్టపరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో రైతుల పక్షాన పోరాటాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పార్టీ జిల్లా కార్యదర్శి జే.రాజు, అఖిలభారత రైతుకూలీ సంఘం జిల్లా అధ్యక్షులు సర్దార్, ఉపాధ్యక్షులు గోపి నర్సయ్య, సహాయ కార్యదర్శి మంచి కంటి లక్ష్మణ్, ఐఎఫ్‌టీయూ జిల్లా నాయకులు సునారికారి రాజేష్, పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షులు సింగరి వెంకటేష్, ఐఎఫ్‌టీయూ జిల్లా నాయకులు దుర్గం లింగన్న పాల్గొన్నారు.

ఘనంగా సంక్రాంతి వేడుకలు



నవతెలంగాణ-ఉట్నూర్

సంక్రాంతి పండుగ వేడుకలను మండలంలో ఆదివారం ఘనంగా నిర్వహించుకున్నారు. ఉట్నూరు మండలంతో పాటుగా ఏజెన్సీ ప్రాంతంలో ఆయా మండలాల్లో గిరిజన గ్రామాల్లో సంక్రాంతి పండుగ ఉత్సవాలను ప్రజలు అంగరంగ వైభోగవంగా నిర్వహించుకున్నారు. ఇంటిముందు వాకిళ్లలో ఉదయం నుంచి చిన్న, పెద్ద తేడాలు లేకుండా చిన్నారులు, యువతులు, మహిళలు రంగురంగుల ముగ్గులు వేశారు. చిన్నారులు, యువకులు ఆయా క్రీడా మైదానాల్లో, గ్రామాల్లో పతంగులు ఎగరవేయడంతో సందడి వాతావరణం నెలకొంది.

కంటివెలుగు విజయవంతం చేయాలి

నవతెలంగాణ-లక్ష్మణచాంద

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ఈనెల 18న రాష్ట్ర వ్యాప్తంగా రెండో విడత కంటి వెలుగు పథకాన్ని ప్రారంభిస్తున్నది. అదే రోజున మండల కేంద్రంలోని రైతు వేదికలో ప్రారంభం కానున్న రెండో విడత కంటి వెలుగు ప్రారంభోత్సవాన్ని విజయవంతం చేయాలని అన్నారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ శ్రీకాంత్ ఆధ్వర్యంలో ఎంపీపీ అడ్వాల పద్మా రమేష్, జెడ్పీటీసీ ఒస రాజేశ్వర్, వివిధ గ్రామాల సర్పంచులకు ఎంపీటీసీలకు వైద్య సిబ్బంది ప్రారంభోత్సవ ఆహ్వాన లేఖలు అందజేశారు. కంటి వెలుగులో ప్రజలు, అధికారులు, ప్రజాప్రతినిధులు అందరూ పాల్గొనాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ మోహన్, తహసీల్దార్ కవిత రెడ్డి, వైద్యులు శ్రీకాంత్, వైష్ణవి, శ్రీమంత్, ఆశా సిబ్బంది, వైద్య సహాయకులు శివకృష్ణ, సిబ్బంది, అంగన్‌వాడీ సిబ్బంది పాల్గొన్నారు.

బజార్‌హత్నూర్: కంటివెలుగు కార్యక్రమాన్ని ప్రజాప్రతినిధులు, అధికారులు విజయవంతం చేయాలని ఎంపీడీఓ చౌహన్ రాధ అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వైద్య, పంచాయతీ అధికారులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఈనెల 18న నిర్వహించే కంటి వెలుగు కార్యక్రమాన్ని గ్రామాల్లో క్షేత్రస్థాయిలో ప్రజలు సద్వినియోగం చేసుకునేలా ప్రతి ఒక ప్రజాప్రతినిధులు, అధికారులు కృషి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపీఓ మహేందర్ రెడ్డి, స్థానిక వైద్యులు భీంరావు, అలేఖ్య, శ్రావ్యవాణి, సూపర్‌వైజర్లు, ఏఎన్‌ఎంలు పాల్గొన్నారు.

బాధిత కుటుంబాన్ని పరామర్శించిన ఎమ్మెల్యే

నవతెలంగాణ-సిరికొండ

మండలంలోని పొన్న ఎంపీటీసీ చవాన్ సూర్యకాంత్ తండ్రి చవాన్ కేశవ్ పాటిల్ ఇటీవల మృతి చెందాడు. ఈ విషయం తెలుసుకున్న బోథ్ ఎమ్మెల్యే రాథోడ్ బాపురావు, ఎంపీటీసీ కుటుంబాన్ని పరామర్శించారు. తన ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఆయన వెంట బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు బాలాజీ, రైతుబంధు సమితి మండల అధ్యక్షుడు అశోక్, సర్పంచ్ చంద్రకళ, రోహిదాస్, సుభాష్, ప్రకాష్, గొర్ల రాజన్న, గొర్ల శంకర్, సూర్యకాంత్, ఈశ్వర్ పాల్గొన్నారు.

నార్నూర్‌లో కొనసాగుతున్న జాతర సందడి

నవతెలంగాణ-నార్నూర్

మండల కేంద్రంలో పుష్యమాసం సందర్భంగా ప్రారంభమైన ఖాందేవ్ జాతర సోమవారం సందడి నెలకొంది. సంక్రాంతి సెలవులు కావడం తో చుట్టు పక్కల గ్రామాల ప్రజలు, యువతీ, యువకులు, చిన్నారులు తరలివచ్చారు. ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు.

ముగిసిన తల సప్తమి వేడుకలు

నవతెలంగాణ-కుభీర్

తెలంగాణ, మహారాష్ట్ర సరిహద్దులో ఉన్న మర్లగొండ గ్రామ పంచాయతీకి దగ్గరలో ఉన్న మహాదేవు శివ మందిరంలో ఈనెల 7వ తేదీ నుంచి సప్తమి వేడుకలు ప్రారంభించారు. దీంతో ఏడు రోజుల పాటు సప్తమి వేడుకలు ఆదివారం ముగిశాయి.

ఓడ్ కుల క్యాలెండర్ ఆవిష్కరణ

నవతెలంగాణ-నిర్మల్

కొత్తగా బీసీ జాబితాలో చేర్చిన సంచార ఓడ్ కుల సంఘం నూతన సంవత్సర క్యాలెండర్‌ను మంత్రి అల్లోల ఇంద్రకరణ్ రెడ్డి నివాసంలో సోమవారం ఆవిష్కరించారు. సంచార ఓడ్ కులం ఏడు దశాబ్దాలుగా గుర్తింపుకు నోచకుండా ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందడంలేదని, తమ సంక్షేమానికి తెలంగాణ ప్రభుత్వం కృషి చేయాలని సంఘం రాష్ట్ర అధ్యక్షులు పవర్ కైలాష్ కోరారు. ఈ సందర్భంగా సంఘం కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి మంత్రి హామీ ఇచ్చారు. కార్యక్రమంలో సంతోష్ మోహితే తిరుపతి, సంజు, సాలంకే అశోక్, నాందేవ్, దిలీప్, ఆకాష్, శేకర్, అర్జున్, నాగోరావు, చందు పాల్గొన్నారు.

కొనసాగుతున్న అంతర్ రాష్ట్ర కబడ్డీ పోటీలు

నవతెలంగాణ-బజార్‌హత్నూర్

మండలకేంద్రలో బీఆర్ఎస్ యువజన సంఘ ఆధ్వర్యంలో నిర్వహించిన అంతర్ రాష్ట్రీయ కబడ్డీ పోటీలు మూడో రోజు అట్టహాసంగా కొనసాగాయి. సుమారు 25 జట్లు పోటీల్లో పాల్గొన్నాయని పోటీ నిర్మాహకులు బీఆర్ఎస్ పార్టీ మండల యువజన సంఘం అధ్యక్షుడు డుబ్బుల చంద్రశేఖర్ పేర్కొన్నారు. కబడ్డీ క్రీడాకారులు అభిమానుల్లో ఉల్లాసాన్ని నింపుతున్నాయని కొనియాడారు. ఈ కార్యక్రమంలో మండల బీఆర్ఎస్ బీసీ సెల్ అధ్యక్షుడు చందపురే అంకుష్, మండల మైనార్టీ సెల్ అధ్యక్షుడు రియాజ్ ఖాన్, మండల సోషల్ మీడియా అధ్యక్షులు కప్పే అక్షయ్ కుమార్, గిన్నుర్ ఉపసర్పంచ్ వినోద్, బసవంత్ రావ్, జాదవ్ రమేష్ పాల్గొన్నారు.

ఉత్సాహంగా ముగ్గుల పోటీలు

నవతెలంగాణ-నిర్మల్

సంక్రాంతి పండుగను పురస్కరించుకుని జిల్లా కేంద్రంలోని పలు వార్డులలో ఉత్సహంగా మహిళలకు ముగ్గుల పోటీలను వార్డు సభ్యులు, పలు కమిటీలు, యువజన సంఘాల ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించారు. వార్డు నెం 14 సోఫీనగర్‌లోని హనుమాన్ ఆలయ అభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో ముగ్గుల పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా మున్సిపల్ చైర్మెన్ గంద్రత్ ఈశ్వర్ హాజరయ్యారు. పోటీల్లో అందమైన రంగవల్లులు వేసిన వారికి బహుమతులు ప్రధానం చేశారు. ప్రతీ ఒక్కరూ తమ సంస్కృతి, సాంప్రదాయాలను ఉత్సహంగా నిర్వహించుకోవాలని అన్నారు. కార్యక్రమంలో కాలనీ అధ్యక్షులు కేవీ లక్ష్మణ్, సభ్యులు హనుమంతు రావు, కిరణ్, సాయిబాబా, శకుంతల, కాలనీవాసులు పాల్గొన్నారు.

సంక్రాంతి వేడుకల్లో మహేశ్వర్ రెడ్డి

నవతెలంగాణ-నిర్మల్

సంక్రాంతి వేడుకల్లో ఏఐసీసీ కార్యక్రమాల అమలు కమిటీ చైర్మెన్ ఏలేటి మహేశ్వర్ రెడ్డి ఆదివారం తమ నివాసంలో నాయకులు, కార్యకర్తలతో నిర్వహించారు. వారికి పండుగ శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో డీసీసీ అధ్యక్షులు ముత్యం రెడ్డి, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

టీఏజీఎస్ క్యాలెండర్ ఆవిష్కరణ



నవతెలంగాణ-ఇంద్రవెల్లి

తెలంగాణ ఆదివాసీ గిరిజన సంఘం నూతన సంవత్సర క్యాలెండర్‌ను ఎస్సై డి.సునీల్ ఆవిష్కరించారు. సోమవారం మండల కేంద్రంలోని స్థానిక పోలీస్‌స్టేషన్‌లో టీఏజీఎస్ మండల అధ్యక్షులు పెందూర్ కృష్ణ, కార్యదర్శి ఉయిక విష్ణు, ఉపాధ్యక్షులు కొట్నాక్ చందు, ఆత్రం తనీష్‌లు ఎస్సై డి.సునీల్ చేతుల మీదుగాలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గిరిజనులు సాంస్కృతి, పండుగలపై క్యాలండర్ లో ప్రస్తావించడం వారి ఆచార సాంప్రదాయాలకు నిదర్శనమని అన్నారు.

అర్జీలను పరిశీలించి పరిష్కరించండి

నవతెలంగాణ-ఆదిలాబాద్ కలెక్టరేట్

ప్రజావాణిలో వచ్చే అర్జీలను పరిశీలించి, సాధ్య సాధ్యాల మేరకు పరిష్కరించాలని అదనపు కలెక్టర్ ఎన్.నటరాజ్ అన్నారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో వివిధ ప్రాంతాల నుండి వచ్చిన అర్జీదారుల నుంచి అర్జీలను ఆదిలాబాద్ ఆర్డీఓతో కలిసి స్వీకరించారు. ఈ సందర్భంగా భూసంబంధ సమస్యలు, ఫించన్ మంజూరు, పట్టా సర్టిఫికెట్‌లు, ప్రభుత్వ భూములలో అనధికార నిర్మాణాలపై ఫిర్యాదులు, వ్యక్తిగత సమస్యలు, ఉపాధి, తదితర వంటి దరఖాస్తులను ఆయన స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ భూముల్లో అనధికార నిర్మాణాలు చేపడితే చట్టప్రకారం చర్యలు తీసుకోవడం జరుగుతుందని అన్నారు. సంబంధిత అధికారులు పర్యవేక్షించాలని అన్నారు. భూములకు సంబందించిన సమస్యలు మీసేవ కేంద్రాల ద్వారా దరఖాస్తు చేసుకోవాలని ఆయన సూచించారు. ఈ ప్రజావాణిలో ఆర్డీఓ రమేష్ రాథోడ్, జిల్లా పౌర సంబంధాల అధికారి ఎస్. భీమ్ కుమార్, కలెక్టరేట్ ఎన్నికల విభాగం పర్యవేక్షకురాలు నలంద ప్రియా, వివిధ శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

ముగిసిన బ్యాడ్మింటన్ పోటీలు



నవతెలంగాణ-బజార్‌హత్నూర్

మండల కేంద్రంలోని శిశు మందిర్ పాఠశాల ఆవరణలో గత ఐదు రోజులుగా గౌరు లింగన్న స్మారకార్థం నిర్వహిస్తున్న డబుల్ బ్యాడ్మింటన్ పోటీలు నేటితో ముగిశాయి. సెమీఫైనల్, ఫైనల్ పోటీలకు బోథ్ నియోజకవర్గ కాంగ్రెస్ నాయకులు వన్నెల అశోక్ తండ్రి కిష్టన్న, జెడ్పీటీసీ మల్లెపూల నర్సయ్య హాజరై పోటీలను తిలకించారు. మొదటి, ద్వితీయ బహుమతులను ప్రధానం చేశారు. పోటీల్లో పాల్గొన్న క్రీడాకారులతో మాట్లాడుతూ మారుమూల గిరిజన మండలాల్లో బ్యాడ్మింటన్ పోటీలు నిర్వహిస్తున్న యువతను అభినందించారు. యువత చెడు వ్యసనాలకు బానిస కాకుండా మంచి మార్గంలో నడుస్తూ పలువురికి ఆదర్శంగా నిలవాలని సూచించారు. బ్యాడ్మింటన్ క్రీడా పోటీలు నిర్వహించిన కోంగర్ల ప్రశిత్, వర్ని విష్ణు వర్ధన్, నిఖిల్‌లను అభినందిస్తూ సన్మానించారు. క్రీడా పోటీలకు ముఖ్య అతిథులుగా హాజరైన నాయకులకు మండల యువత శాలువాతో సత్కరించి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సీనియర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు ఇర్ల శివుడు, పాండురంగ్, మేకల కిషన్, సొసైటీ డైరెక్టర్ చట్ల వినిల్, శిశు మందిర్ ప్రధానోపాధ్యాయులు వర్ని వెంకట రమణ, వినాయక్ పాల్గొన్నారు.

ప్రజల సమస్యలను తక్షణం పరిష్కరించండి

నవతెలంగాణ-ఉట్నూర్

గిరిజన దర్బార్‌కి వచ్చి అందించే అర్జీలను తక్షణం పరిష్కరించాలని ఐటీడీఏ పీఓ వరుణ్ రెడ్డి అధికారులను ఆదేశించారు. సోమవారం ఉట్నూర్ ఐటీడీఏ కార్యాలయ సమావేశ మందిరంలో నిర్వహించిన గిరిజన దర్బార్‌లో ఉమ్మడి జిల్లాలోని మారుమూల గిరిజన గ్రామీణ ప్రాంతాల నుండి వచ్చిన ప్రజలు తమ సమస్యలను పరిష్కరించాలంటూ పీఓకు అర్జీలను అందజేశారు. ప్రాంగణంలో ఏర్పాటు చేసిన మిల్లెట్‌కేఫ్ నిర్వాహకురాలు గడ్డం భీంబాయి స్థానికంగా ఉండేందుకు తనకు ఐటీడీఏ క్వార్టర్, వంద శాతం వికలాంగురాలినైనందున మూడు చక్రాల స్కూటర్ మంజూరు చేయాలనీ కోరారు. రైతుబంధు, స్వయం ఉపాధి పథకాల మంజూరు, పోడు భూముల సర్వే, వ్యవసాయ, రెవెన్యూ శాఖలకు సంబంధించిన సమస్యలు పరిష్కరించాలంటూ దరఖాస్తులు అందజేశారు. ఆయా అర్జీలను పరిశీలించిన పీఓ శాఖల వారీగా కేటాయించారు. సమస్యలపై క్షేత్ర స్థాయిలో పర్యవేక్షించి పరిష్కారానికి చర్యలు చేపట్టాలని అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో ఐటీడీఏ ఏపీఓ జనరల్ కనక భీంరావు, పీవీటీజీ ఏపీఓ ఆత్రం భాస్కర్, ఈఈ రాథోడ్ భీమ్ రావ్, ఓఎస్డీ కృష్ణయ్య, ఏఓ రాంబాబు, జెడీఎం నాగభూషణ్, బీఈడీ కళాశాల ప్రిన్సిపాల్ మెస్రం మనోహర్, హెచ్ఓ సుధీర్, డీపీఓ ప్రవీణ్, అధికారులు పాల్గొన్నారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కుల అందజేత



నవతెలంగాణ-కడెం

మండల కేంద్రంలోని రైతు వేదికలో సోమవారం లబ్దిదారులకు ఎమ్మెల్యే అజ్మీర రేఖాశ్యామ్ నాయక్ సీఎంఆర్ఎఫ్ చెక్కులను, కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ సీఎం కేసీఆర్ పేదలకు అండగా నిలిచేందుకు అనేక సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టారని అన్నారు. అందులో భాగంగానే సీఎంఆర్ఎఫ్, కల్యాణలక్ష్మి, షాదీముబారక్, పథకాలు పథకాలు ప్రవేశపెట్టి పేదలను ఆదుకుంటున్నారని అన్నారు. మహిళ సంక్షేమానికి అనేక ప్రభుత్వ సంక్షేమ పథకాలు అమలు చేసి, మహిళలను అన్ని రంగాల్లో ముందంజలో నిలుపాలని లక్ష్యంతో తెలంగాణ ప్రభుత్వం ముందుకు సాగుతోందని అన్నారు. అనంతరం మండల కేంద్రంలో దళిత వాడల్లో పర్యటించి, దళితబంధు పథకంపై అవగాహన కల్పించారు. అనంతరం అభివృద్ధి పనులకు భూమి పూజ చేశారు. అనంతరం యూత్ సభ్యులకు క్రికెట్ కిట్లలను అందచేశారు. ఈ కార్యక్రమంలో మండల బీఆర్ఎస్ అధ్యక్షులు జొన్న చంద్రశేఖర్ గుప్తా, జెడ్పీటీసీ శ్రీనివాస్‌రెడ్డి, మండల ప్రధాన కార్యదర్శి కె.మల్లారెడ్డి, సర్పంచ్ కొండాపురం అనూష లక్ష్మణ్, అధికారులు, నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

టీఎస్‌యూటీఎఫ్ రాష్ట్ర కమిటీలో చోటు

నవతెలంగాణ-ఆసిఫాబాద్

హైదరాబాద్‌లో ఈ నెల 13,14 తేదీలలో నిర్వహించిన టీఎస్ యూటీఎఫ్ రాష్ట్ర మహాసభలలో నిర్వహించిన కమిటీ ఎన్నికలో జిల్లా వాసులకు చోటు లభించింది. మంచిర్యాల, కొమరంభీం ఆసిఫాబాద్ జిల్లాల ప్రతినిధి వైద్య శాంతి కుమారిని రాష్ట్ర కార్యదర్శిగా, అలాగే సోయం ఇందు రావు, అబ్దుల్ ఖమర్, దూలం ఎల్లయ్యలను రాష్ట్ర కమిటీ సభ్యులుగా మహాసభలలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు కమిటీ సభ్యులు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉపాధ్యాయ విద్యారంగ సమస్యల పరిష్కారంలో ఉపాధ్యాయ సమస్యల పరిష్కారం కోసం తమవంతు కృషి చేస్తామని తెలిపారు. రాష్ట్ర కమిటీలో చోటు కల్పించినందుకు రాష్ట్ర కమిటీకి, సహకరించిన జిల్లా సభ్యులకు కృతజ్ఞతలు తెలిపారు.

'అడ ఎస్‌బీఐ బ్రాంచ్ తరలించొద్దు'

నవతెలంగాణ-ఆసిఫాబాద్

మండలంలోని అడ ఎస్‌బీఐ బ్రాంచ్‌ను ఆసిఫాబాద్ కలెక్టరేట్‌కు తరలించడానికి తీసుకున్న నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ మాజీ ఎంపీపీ బాలేష్ గౌడ్ ఆధ్వర్యంలో గ్రామస్తులు ఖాతాదారులు కలెక్టరేట్ ఎదుట నిరసన తెలిపారు. అనంతరం ఆసిఫాబాద్ కలెక్టర్ రాహుల్ రాజ్, ఎమ్మెల్యే ఆత్రం సక్కుకు వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ అడ బ్రాంచ్ తరలించడం వల్ల 54 గ్రామాల ప్రజలు ఇబ్బందులు పడాల్సి వస్తుందన్నారు. గిరిజనులకు స్థానికులకు పంట రుణాలు ఇతర బ్యాంకు అవసరాలు తీర్చడంలో ప్రముఖ పాత్ర పోషిస్తున్న బ్యాంకు తరలించడానికి నిర్ణయం తీసుకోవడం దారుణమన్నారు. వెంటనే నిర్ణయాన్ని వెనక్కి తీసుకొని బ్యాంకును అక్కడే కొనసాగించాలని లేదంటే ఆందోళన చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో గ్రామ పెద్ద అడ బాబురావు, మాలి సంఘం అధ్యక్షుడు శంకర్, గ్రామస్తులు శ్యామరావు, సందీప్, తిరుపతి, రమేష్ పాల్గొన్నారు.

చదువుతోనే భవిష్యత్ తరాల మార్పు

నవతెలంగాణ-కాగజ్‌నగర్ రూరల్

ఆదివాసీలు తమ పిల్లలను విధిగా పాఠశాలకు పంపించాలని చదువుతోనే భవిష్యత్ తరాల మార్పు సాధ్యమవుతుందని రాష్ట్ర ట్రాన్స్‌పోర్ట్ సంయుక్త కమిషనర్ పాండురంగ నాయక్ అన్నారు. సోమవారం తన కుటుంబసభ్యులతో కలిసి మారుమూల గిరిజన గ్రామాలైన ఉట్‌పల్లి, రేగులగూడ గ్రామాల్లో జన్మదిన వేడుకలు నిర్వహించారు. గ్రామస్తులకు ఉలన్ దుప్పట్లను పంపిణీ చేశారు. అనంతరం మాట్లాడుతూ నిరక్షరాస్యత కారణంగా గిరిజనులు వెనుకబడుతున్నారని, చదువుకోవడంతో అన్ని విషయాల్లో అవగాహన పెరిగి అభివృద్ధి సాధ్యమవుతుందన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ నగునూరి శ్రీనివాస్ గౌడ్, రూరల్ సీఐ నాగరాజు, ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం వైస్ చైర్మన్ నగునూరి తిరుపతి గౌడ్, రిటైర్డ్ తహసీల్దార్ ఎం.సుభాష్, రిక్యాప్ నిర్వాహకులు వెంకట్, యూఎన్ చారీ, విఠల్ పటేల్ పాల్గొన్నారు.

సీసీ రోడ్డు పనులు ప్రారంభం

నవతెలంగాణ-వేమనపల్లి

వేమనపల్లి మండల కేంద్రంలో సోమవారం సీసీ రోడ్డు పనులను ఎంపీపీ కోలి స్వర్ణలత, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు కోళి వేణు మాధవ్ రావుతో కలిసి ప్రారంభించారు. గణపురం సంతోష్ ఇంటి నుంచి పోరెడ్డి రాకేష్ రెడ్డి ఇంటి వరకు సీడీపీ నిధులతో రూ.10 లక్షలు, గ్రామ పంచాయతీ నిధుల నుంచి రూ.6 లక్షలు మొత్తం రూ.16 లక్షలతో ఈ నిర్మాణ పనులను చేపట్టినట్టు తెలిపారు. కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ కుబిడే మధుకర్, మాజీ ఎంపీపీ కుర్రు వెంకటేశం, కంపెల సత్యం, చిగురాల లక్ష్మణ్, చెన్నూరి వెంకటి పాల్గొన్నారు.

ముగ్గుల పోటీలకు పూర్తి సహకారం

నవతెలంగాణ-జన్నారం

ముగ్గుల పోటీలకు పూర్తి సహకారం అందిస్తామని ఎంపీపీ మాదాడి సరోజన రవీంద్రరావు, జడ్పీటీసీ ఎర్ర చంద్రశేఖర్, స్థానిక సర్పంచ్ జక్కు భూమేష్ అన్నారు. మకర సంక్రాంతి సందర్భంగా కనికారపు రాజన్న, పోతు శంకర్ల జ్ఞాపకార్థం ఆదివారం మండల కేంద్రంలోని మేదరి వాడలో నిర్వహించిన ముగ్గుల పోటీలలో గెలుపొందిన విజేతలకు వారు బహుమతులు అందజేశారు. సంక్రాంతి వేళ ఐద్వా ఆధ్వర్యంలో ముగ్గుల పోటీలు నిర్వహించడం సంతోషంగా ఉందన్నారు. కార్యక్రమంలో ఐద్వా మండల అధ్యక్షురాలు, పోతు విజయశంకర్ పాల్గొన్నారు.

బాబాపూర్‌లో ఎడ్లబండ్ల పోటీలు

నవతెలంగాణ-ఆసిఫాబాద్

సంక్రాంతి పండుగను పురస్కరించుకొని మండలంలోని బాబాపూర్ గ్రామపంచాయతీలో ఆదివారం ఎడ్ల పండ్లు పందెం పోటీలు నిర్వహించారు. పోటీలను ఎంపీపీ అరిగెల మల్లికార్జున్ జండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ఆరు సంవత్సరాల నుండి పండగ సందర్భంగా ఎడ్లబండ్ల పోటీలు, ముగ్గుల పోటీలు నిర్వహిస్తున్న పంచాయతీ ప్రజలను నాయకులను అభినందించారు. అనంతరం పోటీల్లో పాల్గొని విజయం సాధించిన వారికి బహుమతుల ప్రధానం చేశారు. కార్యక్రమంలో గ్రామ కమిటీ సభ్యుడు కిషన్ (పటేల్), సింగిల్ విండో చైర్మన్ అలీ బిన్ అహ్మద్, సర్పంచ్ లక్ష్మి, ఎంపీటీసీ సావిత్రి మల్లేష్, ఉపసర్పంచ్ నిలబాయ్ ఉద్ధవ్, మాజీ ఎంపీపీ బాలేష్ గౌడ్, కమిటీ సభ్యులు ఆనంద్ రావు, రవీందర్, బిజ్జు, సకరం, రాజు, బక్కన్న, రవి, నాయకులు గోపాల్ నాయక్ పాల్గొన్నారు.

అధికారి బదిలీ రద్దు చేయాలని

నవతెలంగాణ-రామకృష్ణాపూర్

పట్టణంలోని స్థానిక సింగరేణి ఏరియా ఆస్పత్రిలో సూపరింటెండెంట్‌గా విధులు నిర్వహిస్తున్న డాక్టర్ రాజా రమేష్‌ను బదిలీ చేయడం సరికాదని ఆయన బదిలీని వెంటనే రద్దు చేయాలని సింగరేణి కాలరీస్ ఎంప్లాయిస్ యూనియన్ (సీఐటీయూ) బ్రాంచ్ అధ్యక్షులు ఎస్.వెంకటస్వామి, కార్యదర్శి అల్లి రాజేందర్ ఒక ప్రకటన లో డిమాండ్ చేశారు. ఆసుపత్రిలో లాంగ్ స్టాండింగ్‌లో ఎంతోమంది అధికారులు, వైద్యాధికారులు ఉండగా కొందరిపై ఆరోపణలు ఉండగా కూడా వారందరినీ వదిలేసి కేవలం కార్మికులకు, కోల్ బెల్ట్ ప్రాంతంలోని కార్మికేతర కుటుంబాలకు జీఎస్ఆర్ ఫౌండేషన్ ద్వారా సేవలందిస్తున్నారనే నెపంతో ఇతర ఏరియాకు బదిలీ చేయడం సరికాదన్నారు. ఎలాంటి ఆరోపణలు లేకుండా నిస్వార్థంగా సేవలందించే అధికారులను ఈ విధంగా బదిలీలు చేయడంపై గుర్తింపు ప్రాతినిధ్య సంఘాలు స్పందించాలని లేకుంటే ఇది వారి వైఫల్యంగానే కార్మికులు, ప్రజలు అర్థం చేసుకోవాలని కోరారు.

కంటి వెలుగుపై అవగాహన

నవతెలంగాణ-వేమనపల్లి

మండలంలోని వేమనపల్లి గ్రామ పంచాయతీ కార్యాలయంలో కంటి వెలుగు కార్యక్రమంపై సర్పంచ్ కుబిడె మధుకర్ అధ్యక్షతన అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎంపీపీ కోళి స్వర్ణలత కంటి వెలుగు ఆహ్వానపత్రము పంపిణి చేశారు. ఈ నెల 18వ తేదీన కంటి వెలుగు కార్యక్రమం ప్రారంభించి 11 రోజులు ఉంటుందని డాక్టర్ రాజేష్ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపిడీఓ లక్ష్మయ్య, ఎంపీఓ శ్రీపతి బాపురావు, ఏపీఓ సత్య ప్రసాద్, డాక్టర్ రాజేష్, డాక్టర్ వారీస్ పాఠన్, పంచాయతీ కార్యదర్శి సిరాజ్, ఉప సర్పంచ్ సత్యం, వార్డు సభ్యులు, ఏఎన్ఎం రాజ లక్ష్మి పాల్గొన్నారు.

గనిని సందర్శించిన ఏరియా ఇంజనీర్



నవతెలంగాణ-రామకృష్ణాపూర్

నూతనంగా మందమర్రి ఏరియా ఇంజనీర్‌గా నియమితులైన జె.నాగరాజు సోమవారం ఆర్‌కె సీహెచ్‌పీ గనిని సందర్శించి బంకర్లు, మెరిట్, ఇంటర్నల్ రోడ్ పనులను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రక్షణ, నాణ్యత విషయంలో ఎట్టిపరిస్థితుల్లోనూ రాజీపడకూడదని తెలిపారు. ఆర్‌కే సీసిహెచ్‌పీ ఉద్యోగులు మంచి సమన్వయంతో ఇన్ టైంలోనే డామరేజీలు పడకుండా కలసికట్టుగా పనిచేశారని, అదేస్ఫూర్తితో క్రమశిక్షణతో పనిచేయడం గొప్ప విషయమని అన్నారు. మందమర్రి ఏరియాకు ఏరియా ఇంజనీర్‌గా రావడం సొంత ఇంటిలో పనిచేసినట్టు ఉందని, భవిష్యత్తులో ఈసీహెచ్‌పీ నుంచి ఇంకా ఎక్కువ రేకులు రవాణా చేయాలని ఆకాక్షించారు. కార్యక్రమంలో సీహెచ్‌పీ డీవైజీఎం బాలాజీ భగవతి ఝా, డీవై ఎస్ఈ ఏ.చంద్రమౌళి పిట్ సెక్రటరీలు శంకర్రావు, సంజీవ్, సూపర్‌వైజర్స్ గంగాధర్, మహేందర్, జె.శ్రీనివాస్, మసాడి తిరుపతి, శ్రీధర్‌రావు పాల్గొన్నారు.

సాగునీటి కోసం రైతుల కన్నెర్ర

- రెండు గంటలపాటు రాస్తారోకో
- మద్దతు తెలిపిన అఖిలపక్షం



నవతెలంగాణ-లక్షెట్టిపేట

ఎండుతున్న పంటలకు సాగు అందించాలని జల సాధన సమితి ఆధ్వర్యంలో ఆదివారం రైతులు ఆందోళనకు దిగారు. మండల కేంద్రంలోని జాతీయ రహదారిపై రైతులు రాస్తారోకో నిర్వహించారు. సుమారు రెండు గంటలపాటు రాస్తారోకో నిర్వహించి ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. దీంతో రోడ్డుకు ఇరువైపుల పెద్దఎత్తున వాహనాలు నిలిచిపోయాయి. ఈ సందర్భంగా జల సాధన సమితి జిల్లా నాయకుడు నైనాల గోవర్ధన్ మాట్లాడుతూ వరి నాట్లు వేసుకున్న కడెం చివరి ఆయకట్టున ఉన్నటువంటి లక్షెట్టిపేట, దండేపల్లి, హాజీపూర్ మండలాల్లో పంటలకు నీరందక ఎండిపోతున్నాయన్నారు. గూడెం లిఫ్ట్ ద్వారా చివరి ఆయకట్టుకు నీరందించే విషయంలో స్థానిక అధికార పార్టీ నాయకత్వం విఫలమైందన్నారు. గూడెం లిఫ్ట్ ప్రారంభించినప్పటి నుంచి సాంకేతిక సమస్యలు, తరచూ పైప్ లైన్ పలగడం లాంటి సమస్యలతోనే సరిపోతుందని మండిపడ్డారు. గతంలో ఈ సమస్య అసెంబ్లీ వరకు వెళ్లిందని అప్పుడున్న నీటి పారుదల శాఖ మంత్రి హరీష్ రావు ఈ సమస్యకు శాశ్వత పరిష్కారం త్వరలోనే చేస్తామని అసెంబ్లీ సాక్షిగా మాటిచ్చారని గుర్తు చేశారు. ఏండ్లు గడుస్తున్నా రైతుల సమస్యలు, సమస్యలుగానే మిగిలి పోతున్నాయన్నారు. శ్రీరాం సాగర్ ప్రాజెక్టు నుంచి కడెం ప్రాజెక్ట్ లోనికి నీటిని విడుదల చేసి కడెం చివరి ఆయకట్టు భూముల వరకు సాగు నీరు అందించే చర్యలు చేపట్టాలని డిమాండ్ చేసారు. నీటి విడుదల గురించి రాతపూర్వకంగా హామీ ఇవ్వాలని నీటి పారుదల శాఖ అధికారులను పట్టుబట్టారు. లేని పక్షంలో ఆందోళన ఉధృతం చేస్తామని హెచ్చరించారు. స్థానిక పోలీసులు, నీటిపారుదల శాఖ అధికారులు సంఘటన స్థలానికి చేరుకొని సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తామని హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు. ఈ ఆందోళనకు మాజీ ఎమ్మెల్సీ ప్రేమ్ సాగర్ రావు మద్దతు తెలిపారు. నాయకులు ఆరిఫ్, హరిగోపాల్, చిన్నయ్య కిషన్, గోపాల్, రమేష్ పాల్గొన్నారు.

డ్రగ్ మాఫియాను అరికట్టాలి

- డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి గొడిసెల కార్తీక్

నవతెలంగాణ-ఆసిఫాబాద్



జిల్లా వ్యాప్తంగా రోజురోజుకీ డ్రగ్ మాఫియా పెరుగుతోందని దాన్ని అరికట్టాలని డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి గుడిసెల కార్తీక్ అన్నారు. జిల్లా కార్యాలయంలో నిర్వహించిన జిల్లా స్థాయి సమావేశంలో మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా కొంతమంది వ్యక్తులు గ్రామాలలో యువకుల అమాయకత్వాన్ని ఆసరా చేసుకొని హైదరాబాద్, మహారాష్ట్ర ప్రాంతాల నుంచి మాదకద్రవ్యాలను తీసుకువచ్చి యువకులకు అలవాటు చేస్తున్నారని ఆరోపించారు. ఇప్పటికే గ్రామాల్లో, పట్టణ కేంద్రాలలో విపరీతంగా యువకులకు మాదక ద్రవ్యాలకు అలవాటు పడిపోతున్నారని తెలిపారు. పోలీసు యంత్రాంగం డ్రగ్ మాఫియా పై అవగాహన సదస్సులు ప్రతి గ్రామంలో నిర్వహించి యువతకు అవగాహన కల్పించాలని కోరారు. లేకుంటే యువకులు మత్తుకు అలవాటు పడి అనారోగ్యాలకు గురయ్యే ప్రమాదం ఉందని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు బోర్కుటే శ్యామ్ రావు, జిల్లా ఉపాధ్యక్షులు ఆత్మకూరు సతీష్, జిల్లా సహాయ కార్యదర్శి గేడం టీకానంద్, జిల్లా ఉపాధ్యక్షులు మాలశ్రీ, జిల్లా నాయకులు చాపిడి పురుషోత్తం, రాజేశ్వర్ పాల్గొన్నారు.

సైక్లింగ్ క్రీడా ఆరోగ్యదాయకం

- ఎంపీపీ స్వర్ణలత శ్రీనివాస్, ఎస్సై ఉదయకిరణ్



నవతెలంగాణ-హాజీపూర్

సైక్లింగ్ క్రీడ పర్యావరణ పరిరక్షణకు దోహదపడుతుందని హాజీపూర్ ఎస్సై ఉదయ్ కిరణ్, ఎంపీపీ మందపల్లి స్వర్ణలత శ్రీనివాస్ అన్నారు. యువరాజ్యం స్వచ్ఛంధ సేవా సంస్థ ఆధ్వర్యంలో ఆదివారం మండలంలోని బుగ్గగట్టు హనుమాన్ విగ్రహం ఎదుట నిర్వహించిన సైకిల్ రేస్ అండర్-10, అండర్-12, అండర్ 15 విభాగాల్లో పోటీలు నిర్వహించారు. ఈ పోటీలను ఎంపీపీ మందపల్లి స్వర్ణలత శ్రీనివాస్, వైస్ ఎంపీపీ బేతు రమాదేవి జెండాలు ఊపి ప్రారంభించారు. అనంతరం ముఖ్య అతిథిగా హాజరైన ఎస్సై ఉదయ్ కిరణ్ అండర్-15 సైకిల్ రెస్ పోటిలో గెలుపొందిన మొదటి బహుమతి గెల్లు సిద్దుకు రూ .3వేల నగదుతో పాటు షీల్డ్ ను ప్రధానం చేశారు. రెండవ బహుమతి మల్యాల అభినయ్‌కు రూ .2 వేలు ఎంపీపీ మందపల్లి స్వర్ణలత శ్రీనివాస్, మూడవ బహుమతి మడిపెల్లి సిద్దుకు రూ.వెయ్యి వైస్ ఎంపీపీ బేతు రమాదేవి-రవిలు అందజేశారు. కార్యక్రమంలో యువరాజ్యం స్వచ్ఛంధ సేవా సంస్థ వ్యవస్థాపకులు గొర్రె లక్ష్మణ్, ప్రధాన కార్యదర్శి చింతకింది మధు సుధన్, గౌరవ సలహాదారులు అత్తె సాగర్, వొడ్నాల సత్యనారాయణ, ఎంపీటీసీ ఒడ్డె బాలరాజ్, ఉప సర్పంచ్ లక్ష్మణ్, యువరాజ్యం స్వచ్ఛంధ సేవా సంస్థ సభ్యులు మల్యాల రాజ్ కుమార్, అలిశెట్టి కోటి, దొమ్మటి రాజేష్, పీఈటీలు నరేందర్, మేకల లక్ష్మణ్ పాల్గొన్నారు.

కంటి వెలుగు కార్యక్రమాన్ని విజయవంతం చేయాలి

నవతెలంగాణ-జన్నారం

కంటి వెలుగు కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని మండల ప్రత్యేక అధికారి రమేష్ సూచించారు. సోమవారం ప్రభుత్వ ఆదేశాల మేరకు మండలంలోని ఇంధన్ పల్లి, జన్నారం గ్రామాలలో కంటి వెలుగు కార్యక్రమం ప్రారంభానికి సంబంధించిన మాక్ డ్రిల్‌ను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలోని అన్ని గ్రామాలలో జనవరి 18 నుండి కంటి వెలుగు కార్యక్రమం ప్రారంభం కానున్నదని వివరించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ అరుణరాణి, ఎంపీఈఓ రమేష్, మండల వైద్యాధికారి ఉమాశ్రీ, జన్నారం సర్పంచ్ భూషణ వేణి గంగాధర్ గౌడ్, ఇందన్‌పెల్లి సర్పంచ్ కంటెం సునీత, ఆయా గ్రామాల ఎంపీటీసీలు, సాగే శ్రావణి విక్రమ్, మహమ్మద్ రియాజుద్దీన్ పాల్గొన్నారు.

కంటి సమస్య ఏదైనా పరీక్ష చేయించాలి

నవతెలంగాణ-జైపూర్

కంటి చూపు తగ్గడమే కాదు..కంటికి సంబంధించిన సమస్య ఏదైనా పరిక్ష చేయించుకోవాలని మండల పరిషత్ అభివృద్ధి అధికారి సత్యనారాయణ పేర్కొన్నారు. స్థానిక తహసీల్దార్ మోహన్ రెడ్డితో కలిసి సోమవారం మండల కేంద్రంతో పాటు బెజ్జాల గ్రామాలలో ఏర్పాటు చేయనున్న కంటి వెలుగు పరిక్షా కేంద్రాలను పరిశీలించారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న 2వ విడత కంటి వెలుగు కార్యక్రమం ఈ నెల 18 నుంచి మండల పరిధిలో కంటి పరిక్షలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా కుందారం, జైపూర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలకు చెందిన వైద్యులతో కలిసి కంటి వెలుగు కేంద్రాలకు తరలించిన పరికరాలను పరిశీలించారు. కంటి వెలుగు పరిక్షా కేంద్రాల ద్వార అత్యధికంగా కంటి పరిక్షలు చేయించుకోవాలని, దృష్టిలోపం ఉన్నటువంటి వారికి పరిక్షలు నిర్వహించడంతో పాటు కంటి అద్దాలు ఉచితంగా ఇవ్వడం జరుగుతుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో జైపూర్, కుందారం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యులు అనిల్ కుమార్, శ్రావ్య పాల్గొన్నారు.



పరిచయ వేదికను విజయవంతం చేయాలి



నవతెలంగాణ-భీమారం

పద్మశాలి కులస్తుల నూతన వధూవరుల పరిచయ వేదికను విజయవంతం చేయాలని సింగరేణి పద్మశాలి ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు చిలువేరు సధానందం కోరారు. సోమవారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన పద్మశాలి సంఘం సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ నెల 29 ఆదివారం రోజున మంచిర్యాల జిల్లా నస్పూర్ మున్సిపాలిటీలోని తెలంగాణ తల్లి విగ్రమం దగ్గర గల సింగరేణి ఒల్డ్ కమ్యూనిటీ హాల్లో పద్మశాలి నూతన వధువరుల పరిచయ వేదికను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ వేదికను రాష్ట్ర జిల్లాల వ్యాప్తంగా పద్మశాలి కులస్థులు పాల్గొని వివాహ బాంధవ్యాలను కలుపుకునేందుకు ఇది ఒక చక్కని వేధిక అవుతుందన్నారు. పిల్లల వివాహం చేయాలని భావిస్తున్న తల్లిదండ్రులు పాల్గొని ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. కార్యక్రమంలో కోశాధికారి సిరిపురం రంవిందర్, కార్యదర్శి బొద్దున సత్యనారాయణ, భీమారం అధ్యక్షుడు గుడిమల్ల వెంకటేశం, బండి శ్రీరాములు, గుడిమల్ల నరహరి, బండి రాజం, ఆవిడపు మల్లేష్ పాల్గొన్నారు.

నేడు ఈజ్‌గాం ఆలయ హుండీ లెక్కింపు

నవతెలంగాణ-కాగజ్‌నగర్ రూరల్

మండలంలోని ఈజ్ గాం శివమల్లన్న స్వామి దేవాలయంలో మంగళవారం హుండీల లెక్కింపు నిర్వహించనున్నట్లు ఈఓ వేణుగోపాల్ గుప్తా సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. దేవాదాయ శాఖ అధికారుల సమక్షంలో ఆలయంలోని అన్ని హుండీలను లెక్కింపు నిర్వహించడం జరుగుతుందని తెలిపారు.గత మార్చి 4 నుండి హుండీల్లో జమ చేసిన నగదును గత అక్టోబర్ 27న లెక్కించగా రూ.95,776 ఆదాయం ఆలయానికి సమకూరిందని తెలిపారు.

అక్రమ కట్టడాలు కూల్చివేత

నవతెలంగాణ-నస్పూర్

మున్సిపాలిటీ పరిధిలోని అక్రమ నిర్మాణాలను సోమవారం నస్పూర్ తహసీల్దార్ జ్యోతి ఆధ్వర్యంలో కూల్చివేశారు. పట్టణంలోని సర్వే నెంబర్ 72లో చేపట్టిన పలు అక్రమ నిర్మాణాలను, వాగును కబ్జా చేసి కట్టడాలను తొలగించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ ప్రభుత్వ భూముల్లో ఎవరైనా అనుమతి లేకుండా నిర్మాణాలు చేపడితే వారిపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఆర్ఐ మాంతయ్య, సర్వేయర్ సాయి కృష్ణ పాల్గొన్నారు.

మార్కెట్ పరిధిలో రైతులకు ఇబ్బంది లేకుండా చూడాలి

- మార్కెట్ కమిటీ చైర్మన్ గాదవేణి మల్లేష్



నవతెలంగాణ-ఆసిఫాబాద్

మార్కెట్ పరిదిలో పంటల కొనుగోలు ఇతర విషయాలలో రైతులకు ఇబ్బంది లేకుండా చూడాలని మార్కెట్ కమిటి చైర్మన్ గాదవేణి మల్లేష్ అన్నారు. మార్కెట్ కమిటీ కార్యాలయంలో నిర్వహించిన పాలకవర్గ సాధారణ సమావేశంకు అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులకు కావాల్సిన సౌకర్యాలు కల్పించడానికి అభివృద్ధి పనులు చేపట్టాలని సూచించారు. దీనిలో భాగంగా వివిధ అభివృద్ధి పనులకు ఏకగ్రీవ తీర్మానం చేశారు. అభివృద్ధి పనులలో భాగంగా గోదాములను రైతులకు, గవర్నమెంట్ ఏజెన్సీలకు అందుబాటులోకి తేవడానికి కెరమెరి మండలంలో గల నాబార్డు గోదామునకు ప్రహరీ నిర్మాణం, ఇంటర్నల్ సీసీ రోడ్డు నిర్మాణం, మార్కెట్ కమిటీ పరిధిలోని ఐదు మండలాలు ఆసిఫాబాద్, వాంకిడి, కెరమెరి, రెబ్బెన, తిర్యానిలలో రైతులు ధాన్యం ఆరబెట్టుకొనుటకు డ్రైయింగ్ ప్లాట్ ఫారాల నిర్మాణం చేపట్టుటకు గాను తగు అంచనాలు తయారు చేయించి మార్కెటింగ్ శాఖ సంచాలకులకు తీర్మానం పంపడానికి కమిటి ఏకగ్రీవంగా తీర్మాణం చేశారు. సమావేశంలో కమిటీ డైరెక్టర్లు శంకర్ (కెరమెరి పీఏసీఎస్ చైర్మన్), తాళ్ల శ్రీనివాస్ గౌడ్, ఇంగు మల్లేష్, మిట్ట పోషన్న, శ్యామ్ రావు, పెందూర్ ఆనందరావు, గాదె ప్రవీణ్ కుమార్, ఉప్రే రోషన్ కుమార్, మార్కెట్ కమిటీ కార్యదర్శి ఇర్ఫాన్ అహ్మద్ ఖాన్ పాల్గొన్నారు.

బాల్క సురేష్ స్మారక క్రికెట్ పోటీలు

నవతెలంగాణ-జైపూర్

మండలంలోని ఇందారం గ్రామంలో నిర్వహించిన చెన్నూర్ ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ బాల్క సుమన్ తండ్రి బాల్క సురేష్ స్మారక క్రికెట్ పోటీలు నిర్వహించగా ఇందారం సీనియర్ జట్టు విజేతగా నిల్చింది. ఈ నెల 13న ప్రారంభించిన మండల స్థాయి క్రికెట్ పోటీల్లో వివిధ గ్రామాలకు చెందిన 20 జట్లు పాల్గొన్నట్లు నిర్వాహకులు స్థానిక సర్పంచ్ గడ్డం మంజుల ప్రసాద్, వైఎస్ ఎంపీపీ పెద్దపల్లి రమేశ్, ఎంపీటీసీ అరికె స్వర్ణ సంతోష్‌యాదవ్ తెలిపారు. మొదటి స్థానంలో నిల్చిన ఇందారం సీనియర్ జట్టుకు రూ.10 వేలు ద్వితీయ స్థానంలో నిల్చిన నర్సింగాపూర్ జట్టుకు రూ.5 వేలతో పాటు ట్రోఫీ అందజేయడం జరిగిందని తెలిపారు. కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ సుంకరి శ్రీనివాస్, షెట్‌పల్లి ఎంపీటీసీ బోయిని స్వాతి సంపత్, కనకయ్య పాల్గొన్నారు.

కంటి వెలుగును విజయవంతం చేయండి

నవతెలంగాణ-రామకృష్ణాపూర్

కంటి వెలుగును విజయవంతం చేయాలని పట్టణంలోని స్థానిక ఒకటవ వార్డు డీవీనీటీ పాఠశాలలో సోమవారం మాక్ డ్రిల్ నిర్వహించారు. కార్యక్రమంలో మున్సిపల్ మేనేజర్ కె.నాగరాజు వివరిస్తూ పట్టణ ప్రజలు అందరూ కంటి వెలుగు కార్యక్రమములో పాల్గొని కంటి సమస్యలు ఉన్నవారు. పరీక్షలు చేపించుకోవాలని తెలిపారు. దగ్గరి చూపు సమస్య ఉన్న వారికి తక్షణమే అద్దాలు ఇవ్వడము జరుగుతుందని, దూరపు చూపు ఉన్నవారికి ఆర్డరుపై అద్దాలు అందజెస్తారని తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ జంగం కళ, వైస్ చైర్మన్ ఎర్రం విద్యా సాగర్ రెడ్డి, వార్డు కౌన్సిలర్ పీ.మల్లయ్య, 13వ వార్డు కౌన్సిలర్ జె.శ్రీనివాస్, డాక్టర్ నీరజ, ప్రోగ్రాం ఆఫీసర్, డాక్టర్ మానస, యూపీహెచ్‌సీ, మందమర్రి డాక్టర్ శ్యామల పాటిల్, ఈ.వసంత్ జూనియర్ అసిస్టెంట్ పూర్ణ చందర్ పాల్గొన్నారు.

అడ ప్రాజెక్టు టూరిజం పనులను త్వరగా పూర్తి చేయాలి

- ఆసిఫాబాద్ కలెక్టర్ రాహుల్ రాజ్

నవతెలంగాణ-ఆసిఫాబాద్

అడ ప్రాజెక్టు కింద చేపట్టిన వివిధ రకాల టూరిజం అభివృద్ధి పనులను త్వరగా పూర్తి చేయాలని ఆసిఫాబాద్ కలెక్టర్ రాహుల్ రాజ్ అన్నారు. సోమవారం జిల్లాలోని అడ ప్రాజెక్టు టూరిజం అభివృద్ధి పనులను టూరిజం అధికారి రామకృష్ణతో కలిసి ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో పర్యాటక రంగాన్ని అభివృద్ధి చేసే దిశగా అడ ప్రాజెక్టు కింద జెట్టి బోటుతో పాటు పర్యాటకులు విశ్రాంతి తీసుకునేందుకు 3 కాటేజీలను ఏర్పాటు చేయడం జరుగుతుందని తెలిపారు. పర్యాటకులను ఆకర్షించే విధంగా ఏర్పాటు చేయనున్న స్ప్రింగ్ వంతెన కొరకు టెండర్ ప్రక్రియ పూర్తి చేయడం జరిగిందని, పర్యాటకుల సౌకర్యార్థం ఒక రెస్టారెంట్ నిర్మాణం చేయడం జరుగుతుందని తెలిపారు. ఈ క్రమంలో సంబంధిత అధికారులకు కేటాయించిన లక్ష్యాలను త్వరగా పూర్తి చేసే విధంగా కృషి చేయాలని సూచించారు. కార్యక్రమంలో డీపీఓ రామకృష్ణ, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

'కంటి వెలుగు'కు ఏర్పాట్లు చేయాలి

నవతెలంగాణ-ఆసిఫాబాద్

ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన కంటి వెలుగు 2వ విడత కార్యక్రమాన్ని ఈ నెల 18వ తేదీ నుంచి జిల్లాలో ప్రారంభించడం జరుగుతుందని, ఇందుకు గాను అధికారులు పూర్తి స్థాయి ఏర్పాట్లతో సిద్ధంగా ఉండాలని ఆసిఫాబాద్ కలెక్టర్ రాహుల్ రాజ్ అన్నారు. సోమవారం జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లా అదనపు కలెక్టర్ చాహత్ బాజ్ పాయి, ఎస్పీ సురేష్ కుమార్‌తో కలిసి అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కంటి వెలుగు కార్యక్రమం నిర్వహణకు 26 బృందాలు, ఒక అదనపు బృందాన్ని ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు. వాహనాలు, 26 ఏఆర్ మిషన్లు, ట్రయల్ లెన్స్ బాక్సులు, స్నెల్, విజన్ చార్టులు, కంటి వెలుగు కిట్లు, ట్యాబ్లు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలకు అందించడం జరుగుతుందని తెలిపారు. జిల్లాలో ఏర్పాటు చేస్తున్న శిబిరాలను సంబంధిత అధికారులు పర్యవేక్షించడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి రాజేశ్వర్, డీఎస్పీ పి. శ్రీనివాస్, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి ప్రభాకర్ రెడ్డి, జిల్లా పంచాయతీ అధికారి రమేష్, మున్సిపల్ కమిషనర్ అంజయ్య పాల్గొన్నారు.

ఆర్‌ఎంపీ, పీఎంపీల నూతన క్యాలెండర్ ఆవిష్కరణ

నవతెలంగాణ-చింతలమానేపల్లి

ఆర్ఎంపీ, పీఎంపీ మండల కమిటీ ఆధ్వర్యంలో సోమవారం బాలాజీ అనుకొడ రైతు వేదిక భవన్‌లో ఆ సంఘం నూతన క్యాలెండర్‌ను అధ్యక్షులు బొజ్జ హరికృష్ణ ఆధ్వర్యంలో ఎంపీపీ డుబ్బుల నాన్నయ్య, నాయకులు చప్లే సుధాకర్, రత్నం పాపయ్య, రౌత్ అశోక్‌లు క్యాలెండర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎపీపీ మాట్లాడుతూ ఆర్ఎంపీ,పీఎంపీ వైద్యులు సేవ భావంతో పనిచేస్తారని, పల్లెల్లోని పేదలకు వైద్య సేవలు అందిస్తారని కొనియాడారు. నిస్వార్థంగా మరిన్ని సేవా కర్యాక్రమలు సేస్తూ ముందుకు సాగాలని కోరారు. మండల కేంద్రంలో ఉచిత వైద్య శిబిరాలు నిర్వహించి రోగులకు ఉచితంగా పరీక్షలు చేసి పేదలకు సేవలందించాలన్నారు. కార్యక్రమంలో సంఘం గౌరవ అధ్యక్షులు హనుమంతు యాదవ్, ప్రధాన కార్యదర్శి జి.లక్ష్మణ్ గౌడ్, ఉపాధ్యక్షులు గుర్లే శ్రీనివాస్, జాడి దిలీప్ కుమార్, వర్కింగ్ ప్రెసిడెంట్ చౌదరి హరి, ప్రచార కార్యదరి డోంగ్రే సదాశివ్, రాకేష్ గోల్దార్, ముఖ్య సలహాదారులు దుర్గం శంకర్, జునగారి శేఖర్, అధికార ప్రతినిధి చౌదరి చందు, ట్రెజరర్ చప్లే అంజన్న పాల్గొన్నారు.

www.navatelangana.com
నవతెలంగాణ
ఆదిలాబాద్, నిర్మల్, మంచిర్యాల
కుమురం భీం-ఆసిఫాబాద్
మంగళవారం 17 జనవరి 2023

రేపటిలోగా పరీక్ష ఫీజు చెల్లించాలి

కాగజ్‌నగర్ : డాక్టర్ బీ ఆర్ అంబేద్కర్ ఓపెన్ యూనివర్శిటీలో అడ్మిషన్ తీసుకున్న డిగ్రీ రెగ్యులర్ విద్యార్థులు సెమిస్టర్ 1, 3, 5 విద్యార్థులు ఈ నెల 18లోగా ఆన్‌లైన్ ద్వారా పరీక్ష ఫీజు చెల్లించాలని ఎస్‌కెఈ డిగ్రీ కళాశాల స్టడీ సెంటర్ కో ఆర్డినేటర్ తూడూరు దత్తాత్రేయ ఒక ప్రకటనలో తెలిపారు. సైన్స్ విద్యార్థులు అదనంగా ప్రాక్టికల్ ఫీజు కూడా చెల్లించాల్సి ఉంటుందని తెలిపారు. పరీక్షలు ఫిబ్రవరి నెలలో ఉంటాయని, పూర్తి వివరాలకు 9866398678లో సంప్రదించాలని సూచించారు.

నేడు న్యాక్ సమావేశం

స్థానిక ఎస్‌కెఈ డిగ్రీ కళాశాలలో మంగళవారం నేషనల్ అసెస్‌మెంట్ అండ్ అక్రిడేషన్ కౌన్సిల్ (న్యాక్) సమావేశం నిర్వహించనున్నట్లు కళాశాల కో ఆర్డినేటర్ తూడూరు దత్తాత్రేయ తెలిపారు. మధ్యాహ్నం రెండు గంటలకు నిర్వహించే ఈ సమావేశానికి ఓపెన్ యూనివర్శిటీలో అడ్మిషన్ తీసుకున్న ప్రథమ, ద్వితీయ, తృతీయ రెగ్యులర్ విద్యార్థులతో పాటు పూర్వ విద్యార్థులు, స్టడీ సెంటర్ ఉపాధ్యాయ, ఉపాధ్యాయేతర సిబ్బంది హాజరు కావాలని ఆయన సూచించారు.

అంబులెన్స్‌లో ప్రసవం

నవతెలంగాణ - కౌటాల



చింతలమానెపెల్లి మండలంలోని రణ్‌వెల్లి గ్రామానికి చెందిన దనోర్కర్ సంగీత పురిటి నొప్పులతో బాధపడుతుండగా భర్త సంతోష్ 108కు ఫోన్ చేశారు. వెంటనే అంబులెన్స్ రణ్‌వెల్లికి చేరుకొని సంగీతను తీసుకొస్తుండగా మార్గమధ్యలో ఆడ శిశువుడకు జన్మనిచ్చింది. తల్లీబిడ్డలు క్షేమంగా ఉన్నారు. ఇది ఆమెకు రెండో కాన్పు. అంబులెన్స్ ఈఎన్‌టీ ఎర్ర అజయ్‌కుమార్, పైలెట్ కె. సుభాష్ గర్భిణీని పీహెచ్‌సీకి తరలించారు.

ఆకట్టుకున్న పతంగుల పండుగ



నవతెలంగాణ-కాగజ్‌నగర్

కాగజ్‌నగర్ పట్టణంలోని సర్‌సిల్క్ వెల్ఫేర్ సెంటర్ మైదానంలో ఆదివారం నిర్వహించిన పతంగుల పండుగ పలువురిని ఆకట్టుకుంది. సంక్రాంతి పర్వదినం పురస్కరించుకొని ప్రజాబంధు ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ పతంగుల పండుగకు చిన్నారులు, యువకులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. ఈ పండుగలో మొదటి బహుమతి వచ్చిన వడాల రాజేశ్వర్‌కు రూ. 10 వేలు, రెండో బహుమతి సాధించిన తాజీంకు రూ. 5 వేలు నగదు బహుమతిని ఫౌండేషన్ వ్యవస్థాపకులు డాక్టర్ పాల్వాయి హరీష్‌బాబు అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పండుగలు మన సంస్కృతి సాంప్రదాయాలకు నిదర్శనమని అన్నారు. సర్‌సిల్క్ వెల్ఫేర్ మైదానాన్ని మున్సిపల్ అధికారులు అభివృద్ధి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ బాల్క శ్యాంకుమార్, భజరంగ్‌దళ్ జిల్లా అధ్యక్షులు శివగౌడ్, నాయకులు అరుణ్‌లోయ, చేరాల శ్రీనివాస్, సత్తిబాబు, సంతోష్ ఠాకూర్, అర్జున్, జాడి దీపక్ డొంగ్రి కార్తీక్, కోట వేణుయాదవ్ పాల్గొన్నారు.

ధారుల్ అన్సర్ వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో దుప్పట్ల పంపిణీ



నవతెలంగాణ-తలమడుగు

మండల కేంద్రంలోని రైతువేదిక భవనంలో ఆదివారం దారుల్ అన్సర్ సొసైటీ ఆధ్వర్యంలో 200 మంది పేదవారికి దుప్పట్లను పంపిణీ చేశారు. జెడ్‌పిటిసి గోక గణేష్‌రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడుతూ సామాజిక సేవ అందించడం పట్ల ఆనందం వ్యక్తం చేశారు. దేశంలో లక్షలు, కోట్లు ఉన్న వారు ఎంతో మంది ఉన్నప్పటికీ పేదవారికి దుప్పట్లు పంపిణీ చేయడం గొప్ప విషయమని పేర్కొన్నారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ కరుణాకర్‌రెడ్డి, గ్రామ పెద్దలు శ్రీనివాస్‌రెడ్డి, ప్రకాష్‌రావు, సొసైటీ వైస్ చైర్మన్ నల్ల పద్మాకర్‌రెడ్డి, సొసైటీ సభ్యులు ఆసిఫ్, మొసిన్, కాంగ్రెస్ పార్టీ మండల మైనారిటీ సెల్ అధ్యక్షుడు రఫీక్, సుంకిడి గ్రామస్తులు వెంకన్న యాదవ్, ఉప సర్పంచ్ సత్యపాల్, గ్రామ అభివృద్ధి కమిటీ చైర్మన్ ఆసం రవి పాల్గొన్నారు.

కంటి వెలుగును విజయవంతం చేయాలి

నవతెలంగాణ-ముథోల్

లిరాష్ట్ర ప్రభుత్వం సంపూర్ణ అంధత్వ నిర్మూలన కొరకు ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టి అమలు చేస్తున్న కంటి వెలుగు కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఎంపీడీవో సురేష్ బాబు, డిప్యూటీ డిఎంహెచ్‌ఓ డాక్టర్ ఇద్రిస్ అన్నారు. మండల కేంద్రంలోని శ్రీ పశుపతినాథ్ శివాలయం సమీపంలోని మండపంలో ఏర్పాటు చేసిన కంటి వెలుగు కేంద్రాన్ని సోమవారం పరిశీలించారు. ఈనెల 18 నుండి రెండో విడత కంటి వెలుగు కార్యక్రమాన్ని ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రారంభించిన నేపథ్యంలో ఎలాంటి ఇబ్బందులు కలగకుండా డెమో నిర్వహించారు. అధికారులు మాట్లాడుతూ సిబ్బంది సమన్వయంతో పని చేస్తూ కంటి వెలుగు విజయవంతానికి కృషి చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో ముథోల్ సర్పంచ్ వెంకటాపూర్ రాజేందర్, వైద్యాధికారి గడపాలే ఆకాష్ పాల్గొన్నారు.

ఆదిలాబాద్ అర్బన్ : జిల్లా ప్రజలు కంటి వెలుగు కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని టీఎంఆర్పీఎస్ జిల్లా అధ్యక్షుడు మల్యాల మనోజ్, జిల్లా అధికార ప్రతినిధి నక్క రాందాస్ పిలుపునిచ్చారు. సోమవారం స్థానిక అంబేద్కర్ భవన్‌లో జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన మీడియా సమావేశంలో మాట్లాడారు. ప్రభుత్వం పేద ప్రజలకు ప్రతిష్టాత్మకంగా చేపట్టిన కంటి వెలుగు కార్యక్రమాన్ని అందరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కంటి వెలుగు కార్యక్రమం బుధవారం నుంచి ప్రారంభమవుతున్న నేపథ్యంలో కంటి పరీక్షలకు వెళ్లేవారు తప్పనిసరిగా ఆధార్ కార్డును వెంట తీసుకువెళ్లి కంటి పరీక్షలు చేయించుకోవాలని తెలియజేశారు. గతంలో మాదిరిగా ఈ కార్యక్రమాన్ని మధ్యలోనే నిలిపివేయకుండా నిరంతరం సాగించే విధంగా చూడాలని సీఎం కేసీఆర్‌ను కోరారు. సమావేశంలో టీఎమ్మార్పీఎస్ కోశాధికారి లింగంపెల్లి ప్రసన్నకుమార్, జిల్లా ప్రచార కార్యదర్శి తారా రవికుమార్, పట్టణ అధ్యక్షులు మోతే సుధాకర్, మండల ప్రధాన కార్యదర్శి మోతే శమిందర్ పాల్గొన్నారు

గుడిహత్నూర్ : రెండో విడత కంటి వెలుగు కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని మెడికల్ ఆఫీసర్లు డాక్టర్ శ్యాం సుందర్, డాక్టర్ సాయి ప్రీయా సుచించారు. సోమవారం మండలంలోని కోల్హారీలో కంటివెలుగు ట్రయల్ రన్ నిర్వహించారు. డాక్టర్లు కంటి పరీక్షలు చేసి ఉచితంగా మందులు అందజేస్తారని, ఆపరేషన్ అవసరం ఉన్నవారికి శస్త్ర చికిత్సలు చేస్తారని తెలిపారు. కంటి వెలుగు కార్యక్రమం విజయవంతానికి అందరూ సమష్టిగా పనిచేయాలని సర్పంచ్ గిత్తే కల్పనా సూచించారు.

కాంగ్రెస్ యాత్రను జయప్రదం చేయాలి

నవతెలంగాణ-ఇంద్రవెల్లి

కాంగ్రెస్ పీసీసీ ఆధ్వర్యంలో చేపట్టే హాత్ సే హత్ జోడో యాత్రను జయప్రదం చేయాలని టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వెడ్మా భోజ్జు అన్నారు. సోమవారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ పీసీసీ జాతీయ అధ్యక్షుడు ఖర్గే, రాహుల్ గాంధీ ఆధ్వర్యంలో ఖానాపూర్ నియోజక వర్గంలో యాత్రను జన్నారం మండలం నుంచి ప్రారంభిస్తున్నట్లు వెల్లడించారు. యాత్రను జయప్రదం చేయాలని కార్యకర్తలకు కోరారు.

నాగోబా జాతరకు కొనసాగుతున్న ఏర్పాట్లు

ఇంద్రవెల్లి : జిల్లాలో ప్రసిద్ధి గాంచిన కేస్లాపూర్ నాగోబా జాతర ఏర్పాట్లలో వివిధ శాఖల అధికారులు నిమగ్నమయ్యారు. సోమవారం విద్యుత్ శాఖ ఏఈ రోహిదాస్ తన సిబ్బందితో గోవాడ, మర్రిచెట్టు, దర్బార్ హాల్‌తో పాటు అవసరమైన చోట విద్యుత్ లైట్లను ఏర్పాటు చేశారు. అవసరమైన చోట సింగిల్ ఫేజ్ ట్రాన్స్ ఫార్మర్‌తో పాటు కొత్త స్థంబాలను అమర్చారు. డీఎల్పీఓ ఆధ్వర్యంలో మర్రి చెట్టు ఆవరణలో చెత్తాచెదారం తీసేశారు. గ్రామపంచాయతీ ద్వారా విద్యుత్ దీపాలను ఏర్పాటు చేశారు.

గ్రామాల్లో ఘనంగా సంక్రాంతి సంబురాలు

నార్నూర్ : ఉమ్మడి మండల కేంద్రంతో పాటు అన్ని గ్రామాల్లో సంక్రాంతి సంబురాలు ప్రజలు ఘనంగా నిర్వహించుకున్నారు. భోగి, సంక్రాంతి, కనుమ పండుగను పురస్కరించుకొని మహిళలు పిండి వంటలు చేశారు. ఇండ్ల ముందు వేసిన ముగ్గులు అందరిని అలరించాయి. చిన్నారులు గాలిపటాలను ఎగురవేసి ఆనందోత్సవాల మధ్య సంక్రాంతిని నిర్వహించుకున్నారు.

సిర్పూర్‌లో నీలి జెండా ఎగరేయకపోతే రాజకీయ సన్యాసం తీసుకుంటా

- బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్



నవతెలంగాణ-కాగజ్‌నగర్

రాబోయే ఎన్నికల్లో సిర్పూర్ నియోజకవర్గంలో నీలి జెండా ఎగురేయకపోతే రాజకీయ సన్యాసం తీసుకుంటానని బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ అన్నారు. బహుజన రాజ్యాధికార రెండో విడత పాదయాత్ర ముగింపు సందర్భంగా సోమవారం రాత్రి పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తాలో ఏర్పాటు చేసిన బహిరంగసభలో మాట్లాడారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పాటైనా సిర్పూర్ నియోజకవర్గం ఆంధ్రాపాలనలోనే కొనసాగుతోందన్నారు. రాష్ట్రంలో అభివృద్ధి పనులన్నీ ఆంధ్రా కాంట్రాక్టర్లకే అప్పగిస్తున్నారన్నారు. సిర్పూర్ నియోజకవర్గంలో పనులన్నీ ఆంధ్రాకు చెందిన వల్లభనేని కంపెనీకి అప్పగించి ఇక్కడి నిధులన్నీ దోచిపెడుతున్నారని దుయ్యబట్టారు. తెలంగాణ ప్రాంతం నుంచి గెలుపొందిన ఎమ్మెల్యే కోనప్ప ఆంధ్రా ప్రాంతంపై ప్రేమ చూపిస్తున్నారన్నారు. సీఎం కేసీఆర్, మంత్రి కేటీఆర్ అండతో సిర్పూర్ నియోజకవర్గంలో ఎమ్మెల్యే కోనేరు కోనప్ప అవినీతి అక్రమాలకు పాల్పడుతున్నారని ఆరోపించారు. ఎమ్మెల్యేతో పాటు టీఆర్ఎస్ నాయకులు నియోజకవర్గంలో భూకబ్జాలకు పాల్పడుతున్నారన్నారు. పోలీసు, రెవెన్యూ యంత్రాంగాన్ని తన గుప్పిట్లో పెట్టుకుని బీఎస్పీ నాయకులు, కార్యకర్తలపై అక్రమ కేసులు నమోదు చేస్తున్నారన్నారు. సిర్పూర్ నియోజకవర్గంలో కట్టాల్సిన ప్రాణహిత ప్రాజెక్టును మేడిగడ్డకు తరలించి ఇక్కడి రైతులకు తీరని అన్యాయం చేశారని గుర్తు చేశారు. ఆంధ్రా పాలన నుంచి సిర్పూర్‌కు విముక్తి కలగాలంటే వచ్చే ఎన్నికల్లో బీఎస్పీని గెలిపించాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వ చీఫ్ సెక్రెటరీ నియామకంలో సైతం అణగారిన వర్గాలకు అన్యాయం జరిగిందన్నారు. అణగారిన వర్గానికి చెందిన రాణి కుముదిని ప్రస్తుత సీఎస్ శాంతికుమారి కన్నా సంవత్సరం సీనియర్ అయినప్పటికీ సీఎస్‌గా నియమించకపోవడం కేసీఆర్ వైఖరికి నిదర్శనమన్నారు. కేసీఆర్, కేటీఆర్ కనుసన్నల్లో పనిచేస్తారనే సీఎస్‌గా శాంతికుమారిని నియమించారన్నారు. రాబోయే ఎన్నికల్లో సిర్పూర్ నియోజకవర్గంతో పాటు రాష్ట్రంలో అత్యధిక స్థానాలు సాధించి అధికారాన్ని చేజిక్కించుకుంటామని ధీమా వ్యక్తం చేశారు. కార్యక్రమంలో బీఎస్పీ రాష్ట్ర కార్యదర్శి సిడాం గణపతి, నియోజకవర్గ ఇంచార్జి అర్షద్ హుస్సేన్ పాల్గొన్నారు.

ముగిసిన నానుమహారాజ్ జాతర

- ఆకట్టుకున్న కుస్తీ పోటీలు



నవతెలంగాణ-సారంగాపూర్

మండలంలోని బండరేవుతండాలో ఐదు రోజులుగా కొనసాగిన నాను మహారాజ్ జాతర ఆదివారం రాత్రి ముగిసింది. చివరి రోజు తెలంగాణ రాష్ట్ర సేవలాల్ సేన గౌరవ అధ్యక్షులు శ్యామ్‌నాయక్, జెడ్పీటీసీ రాజేశ్వర్‌రెడ్డి హాజరై నాను మహారాజ్ ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ ప్రతి సంవత్సరం జరుపుకునే నానుమహారాజ్ జాతరలో పెద్ద ఎత్తున క్రీడా పోటీలు నిర్వహించడం అభినందనీయమన్నారు. ఈ సందర్భంగా ఆలయ అభివృద్ధికి చెరో రూ.5 వేల అందజేశారు. వారిని జాతర నిర్వాహకులు శాలువాతో సన్మానించి కృతజ్ఞతలు తెలియజేశారు.

ఆకట్టుకున్న కుస్తీ పోటీలు

జాతర చివరి రోజు నిర్వహించిన కుస్తీ పోటీలు పోటాపోటీగా కొనసాగాయి. పోటీల్లో మల్లయోధులు మహారాష్ట్ర చుట్టుపక్కల గ్రామాల నుండి పెద్ద ఎత్తున పాల్గొన్నారు. ఐదు రోజుల పాటు నిర్వహించిన పోటీలలో గెలుపొందిన జట్లకు బహుమతులను అందజేశారు.

క్రీడల్లో యువత రాణించాలి

క్రీడల్లో యువత రాణించాలని మాజీ ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్‌రెడ్డి అన్నారు. ఆదివారం మండలంలోని బండరేవుతండాలో గల నాను మహారాజ్, జగదాంబ ఆలయ 30వ వార్షికోత్సవానికి హాజరై ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం వివిధ ఆటల పోటీలను తిలకించారు. గెలుపొందిన జట్లకు మొత్తం రూ.26వేలు అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడారు. జాతరలో కొన్నేళ్లుగా సంప్రదాయాలతో పోటీలు నిర్వహించడం అభినందనీయమన్నారు. యువకులు చదువుతో పాటు క్రీడల్లో రాణించాలని, క్రీడలతో శారీరక దారుఢ్యంతో పాటు స్నేహ సంబంధాలు మెరుగుపడతాయన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు ముత్యంరెడ్డి, సీనియర్ నాయకులు తక్కల రమణరెడ్డి, మండల అధ్యక్షుడు రాంశంకర్‌రెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు దశరథ రాజేశ్వర్, ఉపాధ్యక్షులు సామల వీరయ్య, బిసి కాంగ్రెస్ జిల్లా కన్వీనర్ బడి పోతన్న, మండల పార్టీ యువజన సంఘం అధ్యక్షులు కాల్వ నరేష్, ఎస్టీ సెల్ మండల అధ్యక్షుడు ప్రకాష్ నాయక్, నారాయణ నాయక్, కాంగ్రెస్ పార్టీ నాయకులు మధు పాల్గొన్నారు.

జంగుబాయి దీక్షదారులతో ఎమ్మెల్యే ప్రత్యేక పూజలు



నవతెలంగాణ - కౌటాల

జంగుబాయి దీక్షదారులతో ఎమ్మెల్యే కోనేరు కోనప్ప ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. మండలంలోని వీర్దండి గ్రామంలో జంగుబాయి దీక్షలు స్వీకరించి భక్తిశ్రద్ధలతో, నియమ నిష్టలతో 41 రోజులు దీక్షలో ఉండి 41 రోజుల తర్వాత జంగుబాయి దీక్షదారులు మాల విరమణ చేసుకుంటారు. ఊరిలో 41 రోజుల పాటు మద్యం, మాంసం అన్నీ మానేసి నియమ నిష్టలతో ఉంటారు. జంగుబాయి దీక్ష తీసుకోవడం వల్ల అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడకుండా రాబోయే కాలంలో కూడా ఏ విధంగా ఉండాలనేది తెలుసుకుంటారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ఆధ్యాత్మికగా ఉండడం ఆనందదాయకమని, జంగుబాయి దీక్షదారణతో ఆధ్యాత్మికతతో పాటు సన్మార్గంలో నడుస్తారన్నారు. గ్రామాభివృద్ధికి అన్ని విధాలుగా తమ సహాయ సహకారాలు అందిస్తానన్నారు. కార్యక్రమంలో చింతలమానెపెల్లి ఎంపీపీ డుబ్బుల నానయ్య, డీసీఎంఎస్ వైస్ చైర్మన్ కుమురం మాంతయ్య, సర్పంచ్ మడావి రేణుక, మొగడ్‌దగడ్ ఎంపీటీసీ బొమ్మకంటి మనీష్ పాల్గొన్నారు.

దివ్యాంగులు ఐక్యంగా ఉండి పోరాడాలి

నవతెలంగాణ-ఇచ్చోడ

దివ్యాంగులు ఐక్యంగా ఉండి సమస్యల పరిష్కారం కోసం నిరంతరం పోరాడాలిని జిల్లా ఇన్‌చార్జ్ జక్కుల నారాయణ అన్నారు. సోమవారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ 19న మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయ ఆవరణలో బోథ్ నియోజకవర్గ దివ్యాంగుల సమావేశం నిర్వహించనున్నట్లు తెలిపారు. దివ్యాంగుల సమస్యలపై చర్చ జరుగుతుందని అన్నారు. అనంతరం నూతన కమిటీ ఎన్నుకోవడం జరుగుతుందన్నారు. ఈ సమావేశానికి రాష్ట్రీయ వికలాంగ్ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు ఇసాక్ అలీ హాజరు అవుతున్నట్లు పేర్కొన్నారు. దివ్యంగులందరూ అధిక సంఖ్యలో హాజరై సమావేశాన్ని విజయవంతం చేయాలని కోరారు. సమావేశంలో దివ్యాంగుల సంఘం నాయకులు ఉన్నారు.

సీఎంఆర్ఎఫ్ పేదలకు వరం : ఎమ్మెల్యే రాథోడ్ బాపురావు



నవతెలంగాణ-గుడిహత్నూర్

సీఎంఆర్ఎఫ్ పేదలకు వరం లాంటిదని ఎమ్మెల్యే రాథోడ్ బాపురావు అన్నారు. సోమవారం జిల్లా కేంద్రంలోని ఆయన నివాసంలో మండలానికి చెందిన ముగ్గురు లబ్ధిదారులకు సీఎంఆర్ఎఫ్ చెక్కులను పంపిణీ చేశారు. నలంవార్ సాయిప్రియాకు రూ.20వేలు, జైబాయ్ లక్ష్మణ్‌కు రూ.18వేల 500, సెడ్మకీ లక్ష్మీ 29వేలు మంజూరయ్యాయని వెల్లడించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అనారోగ్య సమస్యలతో సతమతమవుతూ సీఎంఆర్ఎఫ్‌కు దరఖాస్తు చేసుకున్న ప్రతి కుటుంబానికి ఆర్థిక సాయం అందిస్తూ సీఎం కేసీఆర్ పేదల పెన్నిధిగా నిలిచారని పేర్కొన్నారు. ఇచ్చిన హామీలన్నీ అమలు చేస్తూ దేశంలోనే ఆదర్శ ముఖ్యమంత్రిగా కేసీఆర్ చరిత్రలో నిలిచారని అన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల కన్వీనర్ కరాడ్ బ్రహ్మనంద్, మాజీ సర్పంచ్ జలంధర్, బీఆర్ఎస్ నాయకులు ఉన్నారు.

బీసీ కులాల సమీక్షా సమావేశం

నవతెలంగాణ-ఆదిలాబాద్ అర్బన్

బీసీ కులాల సమీక్ష సమావేశం సోమవారం స్థానిక బీసీ సంఘ భవనంలో నిర్వహించారు. బీసీ సంక్షేమ సంఘం జిల్లా బాధ్యుల పదవీకాలం ముగియడంతో జాతీయ అధ్యక్షులు జాజుల శ్రీనివాస్ గౌడ్, చిక్కాల దత్తును కన్వీనర్‌గా, ఈర్ల సత్యనారాయణ, పోరెడ్డి పార్థసారధిలను కో కన్వీనర్లుగా నియమిస్తూ నూతన కమిటీని ఏర్పాటు చేయాలని సూచించారు. ఈ సందర్భంగా కన్వీనర్ చిక్కాల దత్తు మాట్లాడుతూ 36 బీసీకుల సంఘాల అధ్యక్ష ప్రధాన కార్యదర్శులతో సమావేశాన్ని నిర్వహించామని అన్నారు. జిల్లా అధ్యక్ష,ప్రధాన కార్యదర్శులుగా ఎన్నికవుటకు 36 కులాలలోని అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు అర్హులని పేర్కొన్నారు. ఎన్నికైన జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శుల పదవీకాలం మూడు సంవత్సరాలు ఉంటుందని తెలిపారు. బీసీ కులాల ఎన్నికలకు 29న నామినేషన్ల స్వీకరణ, 30న స్క్రూటిని, 31న నామినేషన్ల ఉపసంహరణ, ఫిబ్రవరి 1న తుది జాబితా, గుర్తుల కేటాయింపు ఉంటుందన్నారు. 5న జిల్లా బీసీ కులాల ఎన్నికల నిర్వహణ ఉంటుందన్నారు. ఈ ఎన్నికలకు ప్రభాకర్, స్వామి, సత్యనారాయణ, పిల్లి కిషన్, నవీన్ యాదవ్, జక్కుల శ్రీనివాస్ ఎన్నికల అధికారులుగా వ్యవహరిస్తారని అన్నారు.

వాలీబాల్ టోర్నమెంట్ విజేత మురళీగూడ



నవతెలంగాణ - పెంచికల్‌పేట్

మండలంలోని మురళీగూడ గ్రామంలో నిర్వహించిన వాలీబాల్ టోర్నమెంట్ విజేతగా మురళీగూడ జట్టు నిల్చింది. రన్నరఫ్‌గా చిన్నవద్ర జట్టు నిలిచింది. టోర్నమెంటులో గెలుపొందిన వారికి సర్పంచ్ పొరిశెట్టి ఈశ్వరి, ఉప సర్పంచ్ కామెర ప్రభాకర్ మొదటి బహుమతి మురళీగూడ జట్టుకు రూ.11 వేలు, ద్వితీయ బహుమతి చిన్నవద్ర జట్టుకు రూ.7 వేల నగదును అందజేశారు. కార్యక్రమంలో క్రీడాకారులు పాల్గొన్నారు.

గోదావరిలో గుర్తుతెలియని వృద్ధురాలి మృతదేహం

నవతెలంగాణ-బాసర

గోదావరిలో గుర్తు తెలియని వృద్ధురాలి మృతదేహం లభ్యమైనట్లు ఎస్ఐ మహేష్ తెలిపారు. సోమవారం గోదావరి నదిలో మత్స్యకారుల సాయంతో మహిళ మృతదేహాన్ని వెలికి తీసినట్లు తెలిపారు. వృద్ధురాలి వయస్సు సుమారు 55 వరకు ఉంటుందని, ఇతర ఆధారాలు లభించలేదని అన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. ఎవరికైన వివరాలు తెలిస్తే స్థానిక పోలీసులను సంప్రదించాలని ఎస్ఐ కోరారు.

క్రీడాకారులకు బహుమతులు ప్రదానం

నవతెలంగాణ-తలమడుగు

లచ్చంపూర్ గ్రామంలో నవోదయ యూత్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న క్రికెట్ పోటీలు ఆదివారం ముగిశాయి. మొదటి బహుమతి జెడ్పిటిసి గోక గణేష్‌రెడ్డి, బోథ్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ నాయకులు అడే గజేందర్ రూ.30వేలు, రెండవ బహుమతి సాయి వైకుంఠ ట్రస్ట్ చైర్మన్ వైద్యులు రవి కిరణ్ యాదవ్ రూ.15వేలు అందజేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ గంగమ్మ రాజేశ్వర్, కాంగ్రెస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ భూపెల్లి శ్రీధర్, యాదవ సంఘం జిల్లా అధ్యక్షుడు రఘువీర్ యాదవ్, ప్రధాన ఉపాధ్యాయులు నవీన్, కాంగ్రెస్ నాయకులు వెంకన్న యాదవ్, మైనారిటీ సెల్ అధ్యక్షుడు రఫీక్, మహేందర్ యాదవ్, రవికాంత్ యాదవ్, భూమన్న, స్వామి, వెంకటేష్ గ్రామస్తులు పాల్గొన్నారు.

దేశ సమగ్రతను కాపాడే శక్తి ఉపాధ్యాయులదే

నవతెలంగాణ-అదిలాబాద్ టౌన్

తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం 2023 డైరీలను ఎంపీ సోయం బాపురావు తన నివాసంలో ఉపాధ్యాయులతో కలిసి ఆవిష్కరించారు. అనంతరం ఎంపీ మాట్లాడుతూ ఒక మంచి సమాజాన్ని నిర్మించాలన్నా, దేశ సమగ్రతను కాపాడగల పౌరులను తీర్చిదిద్దాలన్న ఉపాధ్యాయులదే కీలక పాత్ర అన్నారు. విద్యార్థులకు చదువుతో పాటు సంస్కారవంతమైన విద్యను అందిస్తూ, నైతిక విలువలను పెంపొందించే విధంగా కృషి చేయాలని అన్నారు. ఉపాధ్యాయులుగా విద్యార్థులకు క్రమశిక్షణ, విద్యాబుద్ధులు నేర్పడమే కాకుండా నైతిక విలువలు, దేశభక్తిని ప్రబోధిస్తూ, దేశ సమైక్యత కోసం కృషి చేయాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో తపస్ జిల్లా అధ్యక్షులు సునీల్ చవాన్, జిల్లా ప్రధాన కార్యదర్శి వలభోజు గోపికృష్ణ, బచ్చు నారాయణ, చంద్రశేఖర్ ముండే, సురేష్ పాల్గొన్నారు.

రిమ్స్‌లో స్మైల్ సొసైటీ అన్నదానం

నవతెలంగాణ-ఆదిలాబాద్ టౌన్

రిమ్స్ ఆవరణలో స్మైల్ సొసైటీ ఆధ్వర్యంలో ఆదివారం నిరుపేదలకు అన్నదానం నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా సొసైటీ అధ్యక్షుడు కేమ శ్రీకాంత్ మాట్లాడుతూ గత 8 వారాలుగా సొసైటీ ఆధ్వర్యంలో అన్నదానం కొనసాగిస్తున్నామని అన్నారు. నిస్సహాయులకు తమ వంతుగా అన్నదానం చేస్తున్నామని పేర్కొన్నారు. కార్యక్రమంలో సొసైటీ ప్రతినిధులు భూరె సురేష్, రాకేష్, రాధాకృష్ణ, రామకృష్ణ, సాయి, కిరణ్, గంభీర్ పాల్గొన్నారు.

ఆధ్యాత్మికతతోనే మానసిక ప్రశాంతత

నార్నూర్ : ఆధ్యాత్మిక తోనే మానసిక ప్రశాంతత కలుగుతుందని జెడ్పీ చైర్మన్ జనార్ధన్ రాథోడ్ అన్నారు. సోమవారం మండలంలోని మహాగావ్ గ్రామంలో నిర్వహించిన సప్తహ ముగింపు కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. గ్రామంలో పది సంవత్సరాలుగా సప్తహ కార్యక్రమం నిర్వహించడం అభినందనియని అన్నారు. యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉంటూ మంచి మార్గంలో నడవాలన్నారు. కార్యక్రమంలో పీఏసీఎస్ ఇన్‌చార్జి చైర్మన్ ఆడే సురేష్, స్థానిక సర్పంచ్ రాథోడ్ యశ్వంత్ రావ్, సూరజ్ మహారాజ్, నార్నూర్ ఖైర్దాట్వా సర్పంచులు గజానంద్ నాయక్, కనక సేవంతా ప్రభాకర్, నాయకులు జాదవ్ రెడ్డినాయక్, న్యానోబా పుష్కర్, మహేందర్, గంగారాం, రాజన్న పాల్గొన్నారు.

ఒప్పంద వైద్య పోస్టుల భర్తీకి దరఖాస్తులు స్వీకరణ

నవతెలంగాణ-నిర్మల్

తెలంగాణ వైద్య విధాన పరిషత్ జిల్లా ఆసుపత్రులలో ఖాళీగా ఉన్న వైద్యుల పోస్టులకు దరఖాస్తులకు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ దేవేందర్‌రెడ్డి సోమవారం ఓ ప్రకటనలలో పేర్కొన్నారు. గైనకాలోజిస్టులు 3, అనస్తీషియా 1, పిడియాట్రిషన్ 2, డెంటల్ అసిస్టెంట్ సర్జన్ 1, సివిల్ అసిస్టెంట్ సర్జన్‌లు 1 పోస్టులు ఖాళీగా ఉన్నాయని పేర్కొన్నారు. ఒప్పంద పద్ధతిలో నియమించడానికి అర్హత కలిగిన అభ్యర్థులు వారి దరఖాస్తులను జిల్లా కలెక్టర్ కార్యాలయంలో ఈ నెల 18న ఉదయం 10.30 నుండి మధ్యాహ్నం 2గంటల మధ్య అందజేయాలన్నారు. అనంతరం ఎంపిక ప్రక్రియను జిల్లా కలెక్టర్ కార్యాలయంలో వాక్ ఇన్ ఇంటర్వ్యూ పద్ధతి ద్వారా సాయంత్రం 4గంటలకు పూర్తి చేస్తామని పేర్కొన్నారు.

అధ్యాపక పోస్టులకు దరఖాస్తుల స్వీకరణ

ఆదిలాబాద్‌టౌన్ : ఆదిలాబాద్‌లోని కేంద్రీయ విద్యాలయంలో కాంట్రాక్టు పద్ధతిలో వివిధ సబ్జెక్టులో బోధించేందుకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు విద్యాలయ ప్రిన్సిపాల్ అశోక్ సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. 2023-24 ఏడాదికి సంబంధించి టీజీటి (హిందీ, ఇంగ్లీష్, సోషల్ సైన్స్, సంస్కృతం, మ్యాథమెటిక్స్ అండ్ సైన్స్) పిఆర్టి కంప్యూటర్ ఇన్‌స్ట్రక్టర్, స్పోర్ట్స్ కోచ్, ఎడ్యుకేషన్ కౌన్సిలర్, స్పెషల్ ఎడ్యుకేటర్, స్టాఫ్ నర్స్‌కు దరఖాస్తులు అందజేయాలన్నారు. అర్హత గల అభ్యర్థులు ఈ నెల17 నుండి ఫిబ్రవరి 16 వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకోవాలన్నారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా వాసులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని సూచించారు.

ఉపాధిహామీలకు సీనియర్ మేట్ కావాలి

వాంకిడి : మండలంలోని సవాతి గ్రామ పంచాయతీ పరిధిలో గల లంబడితండా, డొంగర్‌గావ్, కొలాంగూడ, అంతాపూర్, బండకాక, సవాతి గ్రామాల్లో ఉపాధిహామీ పనులు చేయడానికి సీనియర్ మేట్ కావాలని సర్పంచ్ దేవ్‌రావు సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. దీనికి జాబ్‌కార్డు కలిగి, కనీసం పదో తరగతి చదివి ఉండి రాయడం, చదవడం వచ్చి ఉండాలని, ఆరు గ్రామాల్లో పర్యటించడానికి ద్విచక్ర వాహనం ఉండాలని, స్మార్ట్‌ఫోన్ కలిగి ఉన్న వారు అర్హులని తెలిపారు. వివరాల కోసం స్థానిక గ్రామ పంచాయతీ కార్యాలయంలో సంప్రదించాలని కోరారు.